సంపుటి : 9
సంచిక : 361
బుధవారం
23 సెప్టెంబర్ 2026
పేజీలు : 12
వెల : 2/-
E-PAPER

# విశ్వ వాయిస్

10 YEARS CELEBRATING

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY.

SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT

CERCULATED AT : • WEST GODAVARI • VISAKHAPATNAM • SRIKAKULAM • VIJAYANAGARAM • VIJAYAWADA • HYDERABAD • BANGLORE • CHENNAI, • DELHI • MUMBAI • TIRUPATHI • ANANTAPUR • GUNTUR • KADAPA • KHAMMAM • KARIMNAGAR • KURNOOL • NELLORE • NIZAMABAD • ONGOLE






Contact For Ads:
7579339999





**ముంబై, సెప్టెంబర్ 22, (విశ్వం వాయిస్ ప్రత్యేక ప్రతినిధి):** భిక్షాటన చేస్తున్న వారికి నగదు ఇవ్వకుండా, అవసరమైన ఆహారం, తాగునీరు వంటి సహాయాన్ని నేరుగా అందించాలనే ఆలోచనతో మహారాష్ట్రలోని పలు ప్రాంతాల్లో అవగాహన ప్రచారాలు సాగుతున్నాయి. ముఖ్యంగా ముంబై, పుణే వంటి నగరాల్లో సామాజిక కార్యకర్తలు, నెటిజన్లు ఈ విధానాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారు. 'ఆకలికి ఆహారం.. నగదుకు నో' అనే భావనతో ప్రజలు తమ వంతు సహాయం అందించాలని ప్రచారం జరుగుతోంది. భిక్షాటన వ్యవస్థలో కొన్ని చోట్ల నేర ముఠాల ప్రమేయం, పిల్లలను ఉపయోగించుకోవడం వంటి ఆరోపణలు గతంలో వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో నగదు సహాయాన్ని నివారించడం ద్వారా అక్రమ కార్యకలాపాలకు ఆర్థిక ప్రయోజనం కలగకుండా చూడవచ్చని ఈ ప్రచారానికి మద్దతు ఇస్తున్న వారు పేర్కొంటున్నారు.

**నగదుకు బదులు నేరుగా అవసరమైన సహాయం**

రోడ్లపై భిక్షాటన చేస్తున్న వృద్ధులు, మహిళలు, దివ్యాంగులు లేదా పిల్లలను చూసినప్పుడు నగదు ఇవ్వడానికి బదులుగా బిస్కెట్లు, పండ్లు, ఆహార పొట్లాలు లేదా తాగునీరు అందించాలని ప్రచారకులు సూచిస్తున్నారు. అయితే ప్రతి భిక్షాటన వెనుక నేర ముఠా ఉందని సాధారణీకరించడం సరికాదని, నిజంగా అవసరంలో ఉన్న వ్యక్తులకు గౌరవప్రదమైన సహాయం మిగతా .. 2లో..

అమ్మాయిలూ..

# దేశం గర్విస్తోంది

**టీమ్‌ఇండియాపై మోదీ ప్రశంసలు**



**సెప్టెంబర్ 22, విశ్వం వాయిస్ న్యూస్ :** వరుసగా రెండోసారి ఆసియా క్రీడల క్రికెట్‌లో భారత మహిళా జట్టు స్వర్ణం నెగ్గింది. తాజాగా శ్రీలంకపై 147 పరుగుల భారీ వ్యత్యాసంతో టీమ్‌ఇండియా విజయం సాధించింది. దీంతో ఆసియా క్రీడలు - 2026 ఎడిషన్‌లో భారత్‌కు తొలి బంగారు పతకం అందించింది. హర్మన్ ప్రీత్ కౌర్ నాయకత్వంలోని టీమ్‌ఇండియా అన్ని విభాగాల్లోనూ ఆధిపత్యం ప్రదర్శించింది. స్వర్ణ పతకం నెగ్గిన అమ్మాయిల జట్టుపై సర్వత్రా ప్రశంసల వర్షం కురుస్తోంది.

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ, క్రికెట్ దిగ్గజం సచిన్ తెందుల్కర్ సహా పలువురు అభినందనలు తెలిపారు. "భారత మహిళ జట్టు సభ్యులందరికీ నా శుభాకాంక్షలు. చరిత్రలో నిలిచిపోయే విజయంతో ఈ ఎడిషన్‌లో తొలి బంగారు పతకం అందించారు. జాతి గర్వపడేలా చేశారు. అద్భుతమైన ప్రదర్శన, బృంద స్ఫూర్తి, నిబద్ధత.. రాబోయే తరాలకు మరీ ముఖ్యంగా ఆడబిడ్డలకు స్ఫూర్తిదాయకం" - **ద్రౌపది ముర్ము**

"భారత క్రికెట్‌కు ఇదొక అద్భుతమైన విజయం. మన అమ్మాయిలకు హృదయపూర్వక మిగతా .. 2లో..

# పట్టణాలే గ్రోత్ ఇంజిన్లు

- వీకెండ్ ఎకానమీ పెంచేలా చర్యలు చేపట్టాలి
- అర్బన్ ప్రాస్పెరిటీ విభాగంగా పట్టణాభివృద్ధి శాఖను తీర్చిదిద్దాలి
- పట్టణ స్థానిక సంస్థల్లో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు
- రాష్ట్రంలోని మున్సిపాల్టీలు-కార్పొరేషన్లలో రూ.11,359 కోట్లతో పనులను ప్రారంభించిన సీఎం
- కుప్పం నుంచి వర్చువల్ గా అభివృద్ధి పనులను ప్రారంభించిన ముఖ్యమంత్రి



**కుప్పం, సెప్టెంబర్ 22, విశ్వం వాయిస్ న్యూస్ :** పట్టణాలే అభివృద్ధి కేంద్రాలుగా మారుతున్నాయని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని ప్రజా ప్రతినిధులు.. అధికారులు ఆ దిశగా కృషి చేయాలని సూచించారు. రాష్ట్రం లోని పట్టణ ప్రాంతాల రూపురేఖలు మార్చేలా రూ.11,359 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంగళవారం కుప్పం నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా 123 మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లలో చేపట్టనున్న పనులకు ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. ఇంత భారీ ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టి రాష్ట్ర మున్సిపల్ చరిత్రలో సువర్ణ అధ్యాయాన్ని లిఖించామన్నారు. రెండేళ్లుగా సంక్లిష్ట పరిస్థితులను అధిగమిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా నడిపిస్తున్నామని చెప్పారు. పట్టణ ప్రాంతాలు ఆర్థిక వ్యవస్థకు గ్రోత్ ఇంజన్లుగా మారేలా చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు. పట్టణాల్లో లివబిలిటీ మెరుగుపడటంతో పాటు ఆహ్లాదకరమైన, ఆరోగ్యకరమైన వాతావరణం ఉండేలా అభివృద్ధి చేయాలని చెప్పారు. పట్టణాల్లో వీకెండ్ ఎకానమీ విపరీతంగా పెరుగుతుందని సీఎం వివరించారు. ప్రజలు తమకు వచ్చే ఆదాయంలో 61 శాతం డబ్బును వారాంతాల్లో ఖర్చు పెడుతున్నారని... అలాగే రవాణా మిగతా .. 2లో..

కూటమి ప్రభుత్వం బలంగా

# ముందుకు సాగాలన్నదే నా కోరిక

- జనసేన గౌరవానికి భంగం కలగకుండా కలిసి పనిచేద్దాం
- పిఠాపురం ప్రజల నమ్మకాన్ని అభివృద్ధిగా తిరిగి ఇస్తున్నాం
- దేశంలోనే మోడల్ నియోజకవర్గంగా పిఠాపురాన్ని తీర్చిదిద్దడమే నా లక్ష్యం
- ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి
- రూ.200 కోట్లతో రహదారులు.. రూ.470 కోట్లతో తాగునీటి పనులు
- రూ.225 కోట్ల అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ.. రూ.323 కోట్లతో ఉప్పాడకు రక్షణ గోడ
- రూ.86 కోట్లతో ఆసుపత్రులు, ఆరోగ్య వసతుల అభివృద్ధి
- పిఠాపురంలో రూ. 1,500 కోట్ల అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనల సభలో పవన్ కళ్యాణ్



**కుప్పం, సెప్టెంబర్ 22, విశ్వం వాయిస్ న్యూస్ :** 'మన కూటమి ప్రభుత్వం మరింత బలంగా, సమర్థవంతంగా ముందుకు సాగాలన్నదే నా కోరిక. అందుకోసం ఎవరి గౌరవానికి భంగం వాటిల్లకుండా అందరం కలిసి పని చేయాలి. ముఖ్యంగా జనసేన పార్టీ గౌరవానికి భంగం వాటిల్లకుండా ఆ దిశగా అడుగులు వేస్తున్నాం. నాకు కృతజ్ఞత చాలా ఎక్కువ. కష్టాల్లో ఉన్న మనిషికి అండగా నిలబడటం నా స్వభావం, నా గుణం. ఈ విలువలను ఈ నేల నేర్పింది. ప్రజల అభివృద్ధే మన ప్రధాన లక్ష్యం. ప్రజల అవసరాలను ముందుగా గుర్తించి, వాటిని మిగతా .. 2లో..

# డేట్, టైమ్ ఫిక్స్ చేసుకొని మాట్లాడుకుందాం..

- వైసీపీకి మంత్రి నారా లోకేశ్ సవాల్
- ఎక్కడున్నా పట్టుకొచ్చి జైల్లో వేస్తామని హెచ్చరిక
- తనపై కోపం ఉంటే నేరుగా తేల్చుకోవాలని సవాల్
- డీఎస్సీ, ఏపీపీఎస్సీ, కల్తీ మద్యంపై చర్చకు సిద్ధమని వెల్లడి
- 150 రోజుల్లో 16 వేల టీచర్ పోస్టులు భర్తీ చేశామన్న లోకేశ్
- కార్యకర్తల కోసం ప్రమాద బీమా, రూ.175 కోట్ల సాయం



**రాప్తాడే, సెప్టెంబర్ 22, విశ్వం వాయిస్ న్యూస్ :** ఉపాధ్యాయులపై దాడికి పాల్పడిన వారిలో ఏ ఒక్కరినీ వదిలి పెట్టబోమని టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ స్పష్టం చేశారు. ఏపీలోనే కాదు.. అండమాన్, మిగతా .. 2లో..

# నేను జగన్‌ను కలిసేది అప్పుడే..

**కూతురి పెళ్లిని అడ్డుపెట్టుకుని రాజకీయాలు చేసే ఖర్మ నాకు లేదు : షర్మిల**



**అమరావతి, సెప్టెంబర్ 22, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (ఏపీసీసీ) అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తనపై సోషల్ మీడియాలో జరుగుతున్న దుష్ప్రచారంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తన సోదరుడు, వైసీపీ అధినేత మిగతా .. 2లో..

# వాయుగుండం ఎఫెక్ట్..

**శ్రీకాకుళం నుంచి బాపట్ల వరకు భారీ వర్షాల హెచ్చరిక**

**ప్రభుత్వ యంత్రాంగాన్ని అప్రమత్తం చేసిన హోంమంత్రి అనిత**



**అమరావతి, సెప్టెంబర్ 22, విశ్వం వాయిస్ న్యూస్ :** వాయుగుండం ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో మిగతా .. 2లో..






ప్రభుత్వ పథకాల్లో

# ఎస్సీ, ఎస్టీలకే పెద్దపీట

**అట్రాసిటీస్ బాధితులకు సత్వర న్యాయం**
**విద్య, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి ద్వారానే మార్పు**
**ఉన్నత స్థాయి కమిటీ సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**



**హైదరాబాద్, సెప్టెంబర్ 22, విశ్వం వాయిస్ న్యూస్ :** విద్య, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి ద్వారానే సమాజంలో మార్పు వస్తుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. దళితులు, గిరిజనులు, ఆదివాసీల అభివృద్ధే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని మిగతా .. 2లో..

# మాదకద్రవ్యాల నియంత్రణలో 'ఈగల్' సత్తా

**80 శాతానికిపైగా మార్కులతో జాతీయ పురస్కారం**



**హైదరాబాద్, సెప్టెంబర్ 22, విశ్వం వాయిస్ న్యూస్ :** మాదకద్రవ్యాల నియంత్రణలో తెలంగాణ పోలీస్‌శాఖ మరోసారి జాతీయస్థాయిలో ప్రతిభ చాటింది. సందీప్ శాండిల్య నేతృత్వంలోని 'ఈగల్' ఫోర్స్ చేపట్టిన సమన్వయ చర్యలు, దర్యాప్తు, నిరోధక కార్యక్రమాలతో కేంద్ర ప్రభుత్వ గుర్తింపు మిగతా .. 2లో..

అలాగైతే 7 రోజుల్లో

# హర్మూజ్‌ను తెరుస్తాం : ఇరాన్



**సెప్టెంబర్ 22, విశ్వం వాయిస్ న్యూస్ :** అమెరికా-ఇరాన్ మధ్య దౌత్యపరమైన అంశాల్లో కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ అమెరికా పర్యటన వేళ టెహ్రాన్ కీలక ప్రకటన చేసింది. అగ్రరాజ్యం తన సైనిక బలగాల మోహరింపును తగ్గించే దిశగా చర్యలు చేపడితే.. 7 రోజుల్లో హర్మూజ్ జలసంధిని తిరిగి తెరుస్తామని పేర్కొంది. ఇరాన్, అమెరికాల మధ్య మధ్యవర్తిత్వం వహించే ప్రయత్నాల్లో భాగమవుతున్న దేశాలతో సంప్రదింపులు జరపడానికి.. ఈ వారం న్యూయార్క్‌లో జరగనున్న మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

# నగదు బంద్.. ఆహారమే నైవేద్యం!

అందించడంతో పాటు, అనుమానాస్పద పరిస్థితులు కనిపిస్తే సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని సామాజిక కార్యకర్తలు సూచిస్తున్నారు.

**పిల్లల విషయంలో మరింత అప్రమత్తత**

చిన్నారులను భిక్షాటనకు ఉపయోగించడం లేదా వారి భద్రతకు ముప్పు ఉన్నట్లు అనిపించిన సందర్భాల్లో ప్రజలు స్వయంగా విచారణ చేయకుండా పోలీసు లేదా సంబంధిత బాలల సంరక్షణ అధికారులను సంప్రదించడం అవసరం.

**ప్రజలు పాటించాల్సిన మూడు సూచనలు**

1. ప్రయాణాల్లో ఆహారం సిద్ధంగా ఉంచుకోండి:
కారు లేదా ద్విచక్ర వాహనాల్లో బిస్కెట్ ప్యాకెట్లు, పండ్లు, నీటి బాటిళ్లు వంటి సాధారణ ఆహార పదార్థాలను అందుబాటులో ఉంచుకోవచ్చు.

2. నగదు బదులు నేరుగా సహాయం చేయండి:
అవసరంలో ఉన్న వ్యక్తికి సాధ్యమైనంతవరకు ఆహారం లేదా నీరు వంటి ప్రత్యక్ష సహాయం అందించవచ్చు.

3. అనుమానాస్పద పరిస్థితుల్లో అధికారులను సంప్రదించండి:
పిల్లలను బలవంతంగా భిక్షాటనకు ఉపయోగిస్తున్నట్లు లేదా మరేదైనా నేర కార్యకలాపం జరుగుతున్నట్లు అనుమానం ఉంటే పోలీసులకు లేదా సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలి.

**మంచితనం సరైన వ్యక్తికి చేరాలి**

సహాయం చేయాలనే మనసు సమాజంలో మరింత బలపడాల్సిన అవసరం ఉంది. అయితే మన సహాయం నిజంగా అవసరంలో ఉన్న వ్యక్తికి చేరేలా జాగ్రత్తలు తీసుకోవడం కూడా అంతే ముఖ్యం. "మన ఉదారత నేర కార్యకలాపాలకు కాకుండా.. ఆకలితో ఉన్నవారికి ఆహారంగా మారాలి." అనే సందేశంతో నగదు రహిత సహాయంపై అవగాహన పెంచే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి.

# వాయుగుండం ఎఫెక్ట్..

రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని హోంమంత్రి వంగలపూడి అనిత అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రతికూల వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆమె సూచించారు. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం.. నేడు, రేపు శ్రీకాకుళం నుంచి బాపట్ల వరకు ఉన్న పలు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. రాష్ట్రంలోని మిగిలిన ప్రాంతాల్లో కూడా అక్కడక్కడ మోస్తరు వర్షపాతం నమోదవుతుందని అధికారులు తెలిపారు. వర్షాలతో పాటు బలమైన ఈదురుగాలులు వీచే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ హెచ్చరికల నేపథ్యంలో హోంమంత్రి అనిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. 24 గంటల పాటు కంట్రోల్ రూమ్‌లను అందుబాటులో ఉంచి, ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. భారీ వర్షాలు, గాలుల కారణంగా ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. చెట్లు, భారీ హోర్డింగ్‌లు, శిథిలావస్థలో ఉన్న భవనాల వద్ద ఎవరూ ఉండవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం జారీ చేసే సూచనలను తప్పనిసరిగా పాటించి, సురక్షితంగా ఉండాలని కోరారు.

# నేను జగన్‌ను కలిసేది అప్పుడే..

వైఎస్ జగన్ మోహన్ రెడ్డితో తాను రహస్యంగా సమావేశం అవుతున్నట్లు వస్తున్న వార్తలు పూర్తిగా నిరాధారమని, అవి కేవ లం కట్టుకథలని కొట్టిపారేశారు. తన కుమార్తె వివాహాన్ని అడ్డుపెట్టుకుని తెర వెనుక రాజకీయాలు చేసుకునే ఖర్మ వైఎస్సార్ బిడ్డగా తనకు లేదని ఘాటుగా వ్యాఖ్యానించారు. కొద్దిరోజులుగా తాను జగన్‌ను కలవబోతున్నట్లు సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు షర్మిల తెలిపారు. తన కుమారుడు రాజారెడ్డి వివాహానికి ఆహ్వానించేందుకు వెళ్లినప్పుడే తాను చివరిసారిగా జగన్‌ను కలిశానని గుర్తుచేశారు. ఇప్పుడు మళ్లీ కలిస్తే, అది కేవలం తన కుమార్తె అంజిలి రెడ్డి వివాహ మహోత్సవానికి ఆహ్వాన పత్రికను అందించడానికి మాత్రమేనని స్పష్టం చేశారు. అన్ని రాజకీయ పార్టీల అధినేతలను ఆహ్వానించినట్లే జగన్‌ను కూడా పిలుస్తానని, ఇందులో వింతేమీ లేదని అన్నారు. "నేను ఎవరినో కలిసినట్లు, ఎక్కడో చేరిపోతున్నట్లు సోషల్ మీడియాలో అల్లుతున్నవి కట్టుకథలు మాత్రమే. ఈ విశ్లేషణలు పూర్తిగా నిరాధారం. శుభకార్యానికి, రాజకీయానికి ముడిపెట్టి నా విశ్వసనీయతను దెబ్బతీయాలని చూస్తే ఊరుకునేది లేదు" అని షర్మిల హెచ్చరించారు.

**వివాహ వేడుకల వివరాలు**

ఈ సందర్భంగా షర్మిల తన కుమార్తె వివాహ వేడుకల వివరాలను అధికారికంగా ప్రకటించారు. తన కుమార్తె వైఎస్ అంజిలి రెడ్డి, సోమల రఘురామ్ రెడ్డిల నిశ్చితార్థం ఈ నెల 24న, వివాహం నవంబర్ 25న, రిసెప్షన్ డిసెంబర్ 5న జరుగుతాయని వెల్లడించారు. ఈ శుభవార్తను తన తండ్రి వైఎస్ రాజశేఖర రెడ్డి ఘాట్ వద్ద పంచుకోవడం ఆనందంగా ఉందన్నారు. కుటుంబ సభ్యులు, కాబోయే వియ్యంకుల సమక్షంలో ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్ వద్ద తొలి వివాహ పత్రికను ఉంచి, ఆయన ఆశీస్సులు తీసుకున్నట్లు తెలిపారు. తన తండ్రి దీవెనలు బిడ్డల జీవితాలకు కొండంత అండ అని షర్మిల పేర్కొన్నారు. కాబోయే నవదంపతులను తెలుగు ప్రజలందరూ హృదయపూర్వకంగా ఆశీర్వదించాలని ఆమె కోరారు.

# డేట్, టైమ్ ఫిక్స్ చేసుకొని మాట్లాడుకుందాం..

ఆస్ట్రేలియాలో ఉన్నా పట్టుకొచ్చి జైల్లో వేస్తామని హెచ్చరించారు. తనపై కోపం ఉంటే నేరుగా తనతో తేల్చుకో వాలని అన్నారు. డేట్, టైమ్ ఫిక్స్ చేసుకుని మాట్లాడుకుందామని చెప్పారు. డీఎస్సీతో పాటు ఏపీపీఎస్సీ, కల్తీ మద్యంపై కూడా చర్చిద్దామని సవాల్ చేశారు.

**చంద్రబాబుపై ఒక్క కేసైనా నిరూపించారా?**

తమది నీతి, నిజాయతీలతో బతికిన కుటుంబమని లోకేశ్ అన్నారు. చంద్రబాబుపై తప్పుడు కేసులు పెట్టి 53 రోజులు జైలులో పెట్టారని చెప్పారు. ఆయనపై పెట్టిన ఒక్క కేసు కూడా నిలబడలేదని పేర్కొన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడే భయపడలేదని, ఇప్పుడు ఎందుకు భయపడతామని ప్రశ్నించారు. జగన్‌పై విమర్శలు చేస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు.

**డీఎస్సీపై వైసీపీ 300 కేసులు**

ఐదేళ్లలో ఒక్క డీఎస్సీ ప్రకటించలేదని, ఒక్క జాబ్ క్యాలెండర్ ఇవ్వలేదని లోకేశ్ విమర్శించారు. బాబు తొలి సంతకం డీఎస్సీపైనే చేశారని తెలిపారు. దాన్ని ముందుకు సాగనీయకుండా వైసీపీ నాయకులు 300 కేసులు వేశారని చెప్పారు. 150 రోజుల్లో 16 వేల టీచర్ పోస్టులు భర్తీ చేశామని పేర్కొన్నారు. వారికి అమరావతిలో అపాయింట్‌మెంట్ లెటర్లు ఇచ్చామని అన్నారు.

**జగన్‌పై లోకేశ్ తీవ్ర వ్యాఖ్యలు**

అబద్ధానికి ప్యాంటు, షర్టు వేస్తే వచ్చే రూపమే జగన్ అంటూ లోకేశ్ వ్యాఖ్యానించారు. నిజం చెబితే తల వెయ్యి ముక్కలు అవుతుందనే శాపం ఆయనకు ఉందంటూ విమర్శించారు. 2019 ఎన్నికలకు ముందు నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ నెరవేర్చలేదన్నారు. ఇప్పుడు వచ్చి డీఎస్సీలో అవినీతి జరిగిందని ఆరోపిస్తున్నారని చెప్పారు.

**టీడీపీకి సేవే లక్ష్యం**

టీడీపీలో తెలుగు యువత, తెలుగు మహిళ, తెలుగు విద్యార్థి వంటి అనుబంధ విభాగాలు ఉన్నాయని లోకేశ్ తెలిపారు. ప్రజలకు సేవ చేయడమే తమ నాయకత్వ లక్ష్యమని చెప్పారు. పరిటాల శ్రీరామ్ లాంటి యువ నాయకత్వం పార్టీలో ఉందన్నారు. వైసీపీ నాయకత్వానికి, టీడీపీ నాయకత్వానికి తేడాను ప్రజలు గమనించాలని కోరారు. ఎన్టీఆర్, చంద్రబాబు నేర్పిన క్రమశిక్షణతోనే పార్టీ ముందుకు సాగుతోందన్నారు.

**పార్టీ కార్యకర్తలకు ప్రాధాన్యం**

కార్యకర్తే అధినేత నినాదాన్ని ఆచరణలో అమలు చేస్తున్నామని లోకేశ్ చెప్పారు. కార్యకర్తల త్యాగాలను చంద్రబాబు మరువరని అన్నారు. కార్యకర్తల కోసం ప్రమాద బీమా తీసుకొచ్చామని తెలిపారు. రూ.175 కోట్లు కార్యకర్తలకు అందించి ఆదుకున్నామని చెప్పారు. కార్యకర్తల ఆరోగ్యాన్ని చూసుకునే బాధ్యత తనదేనని పేర్కొన్నారు.

**పనిచేస్తే పదవులు వస్తాయి**

పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనే వారిని గుర్తిస్తామని లోకేశ్ తెలిపారు. కార్యకర్తలు తాము చేస్తున్న కార్యక్రమాలను మై టీడీపీ యాప్‌లో అప్‌డేట్ చేయాలని సూచించారు. ప్రజల చుట్టూ తిరిగితే పదవులు వెదుక్కుంటూ వస్తాయని అన్నారు. పనిచేయకుండా పదవులు రావాలంటే కుదరదని స్పష్టం చేశారు. పార్టీ ఇచ్చే ప్రతి కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

**అప్పర్ పెన్నార్ రైతులకు పరిహారం**

కూటమి ప్రభుత్వం ప్రాజెక్టులను ఒక్కొక్కటిగా పూర్తి చేస్తూ వెళ్తోందని లోకేశ్ చెప్పారు. అప్పర్ పెన్నార్ రైతులకు పరిహారం అందజేస్తామని తెలిపారు. ఇరిగేషన్ మంత్రితో మాట్లాడి నిధులు కేటాయిస్తామని అన్నారు. రాప్తాడు ప్రాంతానికి పరిశ్రమలు, ఉద్యోగాలు రావాల్సిన అవసరం ఉందన్నారు. పెట్టుబడులు తీసుకురావడంలో స్థానిక నాయకత్వానికి కూడా బాధ్యత ఉందని చెప్పారు.

**అనంతపురంలో సేవాభావం**

అనంతపురం జిల్లాలో సేవాభావం ఉందని లోకేశ్ అన్నారు. లేపాక్షి, నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయం, ప్రశాంతి నిలయం ఉన్న నేలగా అనంతపురాన్ని ప్రస్తావించారు. ఆర్‌డీటీ దశాబ్దాలుగా ప్రజలకు సేవలు అందిస్తోందన్నారు. సేవ చేయాలనే భావన తమలో ఉందని చెప్పారు. అందుకే ఎన్టీఆర్ అనంతపురం జిల్లాను సొంతం చేసుకున్నారని పేర్కొన్నారు.

**పరిటాల కుటుంబంతో అనుబంధం**

పరిటాల కుటుంబంతో తమ కుటుంబానికి దశాబ్దాల అనుబంధం ఉందని లోకేశ్ తెలిపారు. అన్యాయం జరిగిన చోట ఎదురొడ్డి నిలబడటం ఇరు కుటుంబాల ధ్యేయమని చెప్పారు. భూస్వాములతో పోరాడి నిరుపేదలకు భూమి పంచారని పరిటాల శ్రీరాములయ్యను గుర్తుచేశారు. పరిటాల రవీంద్ర ఫ్యాక్షన్‌కు ఫుల్‌స్టాప్ పెట్టారని అన్నారు. ఉమ్మడి అనంతపురంలో పలువురు కార్యకర్తలను కోల్పోయామని తెలిపారు.

**రాప్తాడులో కార్యకర్తలకు అండగా**

2019 నుంచి 2024 వరకు రాప్తాడులో టీడీపీ కేడర్‌ను ఇబ్బంది పెట్టారని లోకేశ్ ఆరోపించారు. తప్పుడు కేసులు బనాయించారని చెప్పారు. తనపై 23 కేసులు పెట్టారని తెలిపారు. పార్టీ కేడర్‌పై పెట్టిన తప్పుడు కేసులను తొలగించే బాధ్యత తనదేనన్నారు. ఇప్పటికే 80 శాతం తప్పుడు కేసులు తొలగించామని చెప్పారు.

# పట్టణాలే గ్రోత్ ఇంజిన్లు

నిమిత్తం 71 శాతం ఖర్చు పెడుతున్నారని వెల్లడించారు. దీనిపై అధికారులు.. ప్రజా ప్రతినిధులు మరింత అధ్యయనం చేయాలని సూచించారు. దీనికి అనుగుణంగా వారాంతాల్లో ఆర్థిక కార్యకలాపాలు పెరిగేలా చర్యలు చేపట్టాలని సూచించారు. గృహవసతి, రవాణా వంటి అవసరాలపై పట్టణ ప్రజలు పెద్ద మొత్తంలో ఖర్చు చేస్తున్న నేపథ్యంలో టిడ్కో ఇళ్లతో పాటు స్త్రీశక్తి వంటి కార్యక్రమాలను చేపట్టామని తెలిపారు. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్-అర్బన్ డెవలప్మెంట్ విభాగం... అర్బన్ ప్రాస్పెరిటీ విభాగంగా పని చేయాలని ముఖ్యమంత్రి సూచించారు.

**టిడ్కో గృహాలు... ఇంటింటికి తాగు నీరు**

2027 నాటికి రాష్ట్రంలోని టిడ్కో గృహాల నిర్మాణాన్ని పూర్తి చేస్తామని సీఎం ప్రకటించారు. విశాఖ నగరంలో 28,500 కుటుంబాలకు ఇప్పటికే ఇళ్ల పట్టాలు ఇచ్చామని, అభ్యంతరాలు లేని ప్రాంతాల్లో మరిన్ని పట్టాలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. పట్టణ ప్రజలకు 24 గంటలూ సురక్షితమైన తాగునీరు అందించే లక్ష్యంతో జల్ జీవన్ మిషన్‌ను పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. భవన నిర్మాణ అనుమతులను వేగంగా మంజూరు చేస్తున్నామని, పట్టణాభివృద్ధిలో పలు సంస్కరణలు చేపట్టామని చెప్పారు. స్వచ్ఛాంధ్ర--స్వర్ణాంధ్ర కార్యక్రమాల ద్వారా పట్టణాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దుతున్నామని సీఎం తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 143 లక్షల టన్నుల చెత్తను తొలగించామని, ప్రస్తుతం రెండు వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లు పనిచేస్తున్నాయని చెప్పారు. మరో నాలుగు ప్లాంట్ల నిర్మాణాన్ని త్వరలో పూర్తి చేస్తామని వెల్లడించారు. ఘన వ్యర్థాలను రీసైక్లింగ్ విధానంలో శాస్త్రీయంగా నిర్వహిస్తూ మున్సిపాలిటీల్లో మురుగునీరు, చెత్త లేకుండా పరిశుభ్రంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు.

**పట్టణ స్థానిక సంస్థలపై ఆర్థిక భారం లేకుండా హైబ్రీడ్ యాన్యుటీ పద్ధతుల్లో అభివృద్ధి పనులు**

ప్రస్తుతం ప్రారంభించిన పనులతో కలిపి పట్టణ ప్రాంతాల్లో రూ.50 వేల కోట్ల విలువైన పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేశామని, ఇవన్నీ పూర్తయితే రాష్ట్ర పట్టణ ప్రాంతాల దశ, దిశ మారుతుందని పేర్కొన్నారు. ఇప్పటికే రూ.22,330 కోట్ల విలువైన పనులు కొనసాగుతున్నాయని, మరో ఆరు నెలల్లో రూ.17 వేల కోట్ల పనులను ప్రారంభించనున్నట్లు తెలిపారు. హైబ్రిడ్ యాన్యుటీ మోడల్‌లో తొలిసారిగా పట్టణాభివృద్ధి పనులు చేపడుతున్నామని సీఎం తెలిపారు. పట్టణ స్థానిక సంస్థలపై ఆర్థిక భారం పడకుండా ఈ విధానంలో పనులు చేపడుతున్నట్లు చెప్పారు. 123 మున్సిపాలిటీల పరిధిలో రూ.7,469 కోట్లతో, గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రూ.3,890 కోట్లతో పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఈ ప్రాజెక్టులో భాగంగా రూ.4,656 కోట్లతో రహదారులు, రూ.88 కోట్లతో సెంట్రల్ మీడియన్లు, రూ.247 కోట్లతో వీధి దీపాలు, రూ.509 కోట్లతో పార్కుల అభివృద్ధి చేపట్టనున్నారు. మొత్తం సుమారు 2,165 కిలోమీటర్ల రహదారులు, 502 పార్కులు, 210 కిలోమీటర్ల సెంట్రల్ మీడియన్లు, 391 కిలోమీటర్ల స్ట్రీట్ లైటింగ్, 300 కిలోమీటర్ల సీవరేజీ పనులు చేపట్టనున్నారు. 2047 నాటికి ప్రతి మున్సిపాలిటీని స్వర్ణ మున్సిపాలిటీగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేయాలని సీఎం చంద్రబాబు ప్రజాప్రతినిధులు, మున్సిపల్ కమిషనర్లు, అధికారులకు దిశానిర్దేశం చేశారు. పట్టణ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపడుతున్న మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ, అధికారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం నుంచి పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ పాల్గొనగా... కుప్పంలో జరిగిన కార్యక్రమంలో పట్టణాభివృద్ధి శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఇక వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పట్టణ స్థానిక సంస్థలకు చెందిన ప్రజాప్రతినిధులు, మున్సిపల్ కమిషనర్లు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

# ముందుకు సాగాలన్నదే నా కోరిక

తీర్చేందుకు చిత్తశుద్ధితో పనిచేద్దాం. వారి ఆశలు, ఆకాంక్షలకు తరువాత ముందుకు తీసుకెళ్దాం. వచ్చే మూడు, నాలుగు నెలల్లో నా క్యాంపు ఆఫీసును పిఠాపురంలో పెట్టడానికి ఏర్పాట్లు చేస్తాం' అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు. పిఠాపురం నియోజకవర్గాన్ని దేశంలోనే మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దాలన్నదే నా సంకల్పం. ఆ లక్ష్యంతోనే ఇప్పటికే వివిధ రంగాల్లో కోట్లాది రూపాయలతో అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టామన్నారు. తాజాగా మరో రూ.1,500 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ప్రజల అవసరాలే ప్రాధాన్యంగా రహదారులు, తాగునీరు, పారిశుధ్యం, విద్య, వైద్యం, మౌలిక వసతుల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని స్పష్టం చేశారు. పిఠాపురాన్ని కేవలం ఒక నియోజకవర్గంగా కాకుండా, అభివృద్ధికి నమూనాగా నిలబెట్టే దిశగా అడుగులు వేస్తున్నామన్నారు. పిఠాపురం ప్రజలు ఇచ్చిన గెలుపు రాష్ట్ర అభివృద్ధి కే కాకుండా దేశ అభివృద్ధికి పునాదిగా నిలిచిందని చెప్పారు. మంగళవారం పిఠాపురం ఆర్ఆర్‌బీహెచ్ఆర్ కళాశాల మైదానంలో జరిగిన బహిరంగ సభలో పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ మాట్లాడుతూ "పిఠాపురం నియోజక వర్గంలో గత రెండు సంవత్సరాలుగా జరుగుతున్న అభివృద్ధిని కళ్లముందు చూస్తున్నాం. వివిధ రంగాల్లో ఎన్నో కోట్ల రూపాయలతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ముందుకు తీసుకెళ్లాం. ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం పిఠాపురాన్ని దేశంలోనే ఒక మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దే దిశగా, పిఠాపురం భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తూ ముందుకు సాగుతున్నాం.

**600కు పైగా సీసీ, బీటీ రోడ్లు పూర్తి చేశాం**

అధికారం చేపట్టిన తర్వాత పిఠాపురం నియోజకవర్గంలో రహదారుల నిర్మాణానికే రూ.200 కోట్లకు పైగా నిధులు వెచ్చించి, ఇప్పటికే 600 కు పైగా సీసీ రోడ్స్, బీటీ రోడ్స్ నిర్మాణం పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చాం. ఈ రోజు మరో 202 రహదారులను ప్రారంభించాం. ఉప్పాడ కొత్తపల్లి మండలంలో దాదాపు రూ.10 కోట్లతో నాగులాపల్లి సమగ్ర రక్షిత మంచినీటి పథకాన్ని ఆధునీకరించి, 97 వేల మందికి తాగునీటి భరోసా కల్పించాం. గ్రామాల్లో జల్ జీవన్ మిషన్, అమరజీవి జలధార నిధులతో దాదాపు రూ.320 కోట్లతో, పట్టణాల్లో అమృత్ 2.0, ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ సహకారంతో పిఠాపురం, గొల్లప్రోలు మున్సిపాలిటీల్లో దాదాపు రూ.140 కోట్లతో తాగునీటి పనులు చేపడుతున్నాం.

**ఆరోగ్య వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నాం**

పిఠాపురంతోపాటు పరిసర నియోజకవర్గాల ప్రజలకు మెరుగైన వైద్యం అందేలా రూ.34 కోట్లతో 100 పడకల ప్రాంతీయ ఆసుపత్రిని అభివృద్ధి చేస్తున్నాం, ఇప్పటికే పనులు 50 శాతానికి పైగా పూర్తయ్యాయి. యు.కొత్తపల్లి, చేబ్రోలులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆయుర్వేద డిస్పెన్సరీ ఏర్పాటు చేశాం. రూ.7 కోట్లతో 26 కొత్త ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలు నిర్మిస్తున్నాం. గత ప్రభుత్వంలో అర్ధాంతరంగా ఆగిపోయిన ఆరు గ్రామ ఆరోగ్య కేంద్రాలను పిఠాపురం ప్రాంతీయ అభివృద్ధి సంస్థ (పాడా) నిధులతో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. అలాగే రూ.45 కోట్లతో కాకినాడ జీజీహెచ్ లో ఆంకాలజీ బ్లాక్ , అధునాతన లీనియర్ యాక్సిలరేటర్ పరికరం, మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ వాహనాలు ఏర్పాటు చేస్తున్నాం.

**రూ. 225 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ**

పిఠాపురం ఆధ్యాత్మిక వైభవాన్ని పెంచేందుకు రూ.34 కోట్లతో ఆలయాల అభివృద్ధి, పునరుద్ధరణ పనులు చేపట్టాం. తిరుమల తిరుపతి దేవస్థానం, దేవాదాయశాఖ సహకారంతో 48 భజన మందిరాలు నిర్మిస్తున్నాం. రూ.2 కోట్లతో శ్రీ కుంతీమాధవస్వామి ఆలయ కోనేరు పునరుద్ధరిస్తున్నాం. పక్కనే ఉన్న రథాలపేటలో మారెమ్మ గుడిని పునర్నిర్మించి, ఖాళీ ప్రదేశాన్ని సుందరవనంగా అభివృద్ధి చేస్తున్నాం. గత పర్యటనలో పిఠాపురం పట్టణంలో మురుగు, చెత్త సమస్యను చూశాను. రూ.225 కోట్లతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, రోజుకు 72 లక్షల లీటర్ల సామర్థ్యంతో రెండు మురుగునీటి శుద్ధి ప్లాంట్లు, 40 టన్నుల తడి చెత్త శుద్ధి ప్లాంట్ ను, 5 చోట్ల పబ్లిక్ టాయిలెట్స్ బ్లాక్స్ ఏర్పాటు చేస్తున్నాం. మొగలి సూర్యుడి చెరువు అభివృద్ధి పనులు ప్రారంభించాం. కాలుష్య నియంత్రణ మండలి నిధులతో బేలింగ్ మెషిన్ కాంపాక్టర్ అందుబాటులోకి తెచ్చాం.

**రూ.323 కోట్లతో ఉప్పాడ తీరానికి రక్షణ కవచం**

గతంలో పిఠాపురంలోకి అడుగుపెట్టగానే కనిపించిన డంపింగ్ యార్డ్ సమస్యకు కూడా శాశ్వత పరిష్కారం చూపాం. పాదగయ క్షేత్రానికి సమీపంలో ఉన్న ఆ ప్రాంతంలో రూ.1.83 కోట్లతో సుందరమైన నగరవనాన్ని అభివృద్ధి చేశాం. అలాగే రూ.6 కోట్లతో 11 గ్రామీణ చెరువులను అభివృద్ధి చేస్తున్నాం. ఉప్పాడ తీర ప్రాంత ప్రజలను ఎన్నాళ్లుగానో వేధిస్తున్న సముద్రపు కోత సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ముందుకు వెళ్తున్నాం. రూ.323 కోట్లతో రక్షణ గోడ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతులు సాధించాం. దీనికి సంబంధించిన డిజైన్, సర్వేను ఐఐటీ మద్రాస్ పూర్తి చేసింది, ఇక నిర్మాణ పనులు ప్రారంభమయ్యేలా అవసరమైన ప్రక్రియను వేగంగా పూర్తి చేస్తున్నాం. కేంద్ర హోంమంత్రి శ్రీ అమిత్ షా గారితో పలుదఫాలుగా మాట్లాడి అసాధ్యం అనుకున్న ఈ పనిని సుసాధ్యం చేయగలిగాం. ఈ ప్రయత్నానికి జనసేన పార్టీ చేసిన త్యాగాలు, సంపాదించుకున్న విశ్వసనీయత, గుడ్‌విల్ కూడా కీలకంగా నిలిచాయి. పిఠాపురం ప్రజలు అందించిన ఘన విజయం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు బలాన్ని అందించడమే కాకుండా, ఉప్పాడ తీర ప్రాంత ప్రజల చిరకాల సమస్య అయిన రక్షణ గోడ నిర్మాణానికి కూడా మార్గం సుగమం చేసింది

**రూ. 118 కోట్లతో ఆర్‌ఓబీకి ఆమోదం**

మన పిఠాపురం నడిబొడ్డున పీఎం గతి శక్తి పథకం కింద రూ.118 కోట్లతో రోడ్ ఓవర్ బ్రిడ్జ్ నిర్మించేందుకు ఆమోదం లభించింది. అలాగే దాదాపు రూ. 100 కోట్లతో ఆయుష్ మెడికల్ కాలేజ్, సాస్కి నిధులతో రూ.100 కోట్లతో రోడ్ల అభివృద్ధి, అమృత్ భారత్ పథకం కింద రూ.37 కోట్లతో పిఠాపురం రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు చేపడుతున్నాం. అలాగే పాడా నిధులతో స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ ద్వారా రూ.20 కోట్లతో ఆధునిక బస్సు స్టాండ్, రూ.3 కోట్లతో 4 స్మార్ట్ కిచెన్లు, చేపల మార్కెట్, సిసి డ్రైన్లు, పాఠశాలలకు కాంపౌండ్ వాల్స్, ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు, పంచాయతీ భవనాలు, ఉప్పాడ చేనేత కమ్యూనిటీ హాళ్లు , అంగన్‌వాడీ కేంద్రాలు వంటి పనులను కూడా త్వరగా పూర్తి చేస్తున్నాం.

**రూ.4 కోట్లతో ఆర్ఆర్‌బీహెచ్ఆర్ కళాశాల అభివృద్ధి**

ఆర్ఆర్‌బిహెచ్ఆర్ కళాశాలకు చెందిన విద్యార్థుల కోరిక మేరకు, ప్రస్తుతం శిథిలావస్థకు చేరిన భవనాలను తొలగించి, సుమారు రూ. 4 కోట్లతో కొత్త భవనాలు, కాంపౌండ్ వాల్స్, అదనపు తరగతి గదులు, ప్లే గ్రౌండ్ లెవెలింగ్ పనులు చేపట్టబోతున్నాం. ఈ సందర్భంగా పిఠాపురం నియోజకవర్గ అభివృద్ధికి అన్ని విధాలుగా సహకరిస్తున్న గౌరవ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారికి, గౌరవ హోంమంత్రి శ్రీ అమిత్ షా గారికి, గౌరవ రైల్వే మంత్రి శ్రీ అశ్విని వైష్ణవ్ గారికి, గౌరవ గ్రామీణాభివృద్ధి మంత్రివర్యులు శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ గారికి, గౌరవ ఆరోగ్యశాఖ మంత్రి శ్రీ జె.పి. నడ్డా గారికి, అలాగే గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారికి నా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాను. పిఠాపురం అభివృద్ధి ప్రతి అడుగులో కనిపించాలి, ప్రతి కుటుంబం ముందుకు సాగాలి, మన పిల్లల భవిష్యత్తుకు పిఠాపురం ఒక బలమైన పునాదిగా నిలవాలి. మీరు నాపై ఉంచిన నమ్మకాన్ని అభివృద్ధి రూపంలో తిరిగి అందిస్తూ, పిఠాపురాన్ని మరింత గొప్పగా, మరింత అభివృద్ధి చెందిన నియోజకవర్గంగా తీర్చిదిద్దే వరకు నా ప్రయాణం ఆగదు" అన్నారు.

# దేశం గర్విస్తోంది

శుభాకాంక్షలు. ప్రత్యర్థిపై పూర్తి ఆధిపత్యం ప్రదర్శించడం అభినందనీయం. ఆత్మవిశ్వాసం, అద్భుతమైన నైపుణ్యం, బృందంగా ఆడిన తీరు అమోఘం. ఈ విజయం.. ఆసియా క్రీడల్లో భారత్‌కు తొలి బంగారు పతకం తీసుకొచ్చింది. దేశం గర్వించేలా చేశారు. యువ క్రికెటర్లకు స్ఫూర్తిగా నిలిచారు. ఆసియా క్రీడల్లో తొలిసారి ప్రవేశపెట్టిన ఎంఎంఏ విభాగంలో పతకం నెగ్గిన సుచిక తరియల్‌కు అభినందనలు. చరిత్ర సృష్టించే ప్రదర్శన చేశావు " **- నరేంద్ర మోదీ**

"ఇది కదా క్రికెట్ గేమ్ అందం. భిన్నమైన ఆటగాళ్లు, భిన్నమైన క్షణాలు.. చివరికి గొప్ప ఫలితం. షఫాలీ - స్మృతి మంధాన 99 పరుగుల భాగస్వామ్యమే భారత జట్టుకు ఆత్మవిశ్వాసం తీసుకొచ్చింది. ఆఖర్లో షఫాలీ వర్మ దూకుడైన గేమ్‌తో ప్రత్యర్థి ముందు భారీ లక్ష్యం ఉంచగలిగాం. షఫాలీ, దీప్తి, శ్రేయాంక, శ్రీ చరణి దెబ్బకు శ్రీలంక కుప్పకూలింది. జట్టుగా విజయం సాధించిన టీమ్‌ఇండియాకు కంగ్రాట్స్" **- సచిన్**

# హర్మూజ్‌ను తెరుస్తాం : ఇరాన్

ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశాలను వినియోగించుకోవాలని ఇరాన్ భావిస్తోంది. ఈ ప్రతిపాదనను సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ, సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ సైతం ఆమోదించారన్నారు. నిర్దేశిత కాలంలోగా వాషింగ్టన్ ఓడరేవుల దిగ్బంధనాన్ని ఎత్తివేయకపోతే..అమెరికా స్థావరాలను మరోసారి లక్ష్యం చేసుకోవాల్సి వస్తుందని హెచ్చరించింది. భద్రతా మండలి నిర్దేశించిన 45 రోజుల గడువు సమీపిస్తున్న నేపథ్యంలో ఈ తాజా ప్రతిపాదన వచ్చింది

# మాదకద్రవ్యాల నియంత్రణలో 'ఈగల్' సత్తా

లభించింది. కేంద్రం నిర్దేశించిన ఏడు ప్రధాన అంశాల్లో 80శాతానికిపైగా మార్కులు సాధించి తొలిస్థానంలో నిలిచింది. దిల్లీలో మంగళవారం నుంచి రెండు రోజులపాటు నార్కొటిక్స్ కంట్రోల్ బ్యూరో(ఎన్‌సీబీ) ఆధ్వర్యంలో జరుగుతున్న మూడో జాతీయస్థాయి యాంటీ నార్కొటిక్స్ టాస్క్‌ఫోర్స్(ఏఎన్‌టీఎఫ్) అధిపతుల సమావేశంలో తొలిరోజే ఈ గుర్తింపును సొంతం చేసుకుంది. మాదకద్రవ్యాల రవాణా నిరోధానికి చేపట్టాల్సిన వ్యూహాలపై చర్చిస్తున్న ఈ సదస్సులో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చేతుల మీదుగా సందీప్ శాండిల్య పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఈగల్ ఫోర్స్ పనితీరును డీజీపీ సీవీ ఆనంద్ అభినందించారు.

# ఎస్సీ, ఎస్టీలకే పెద్దపీట

తెలిపారు. ఎస్సీ, ఎస్టీలపై అణచివేతను అధిగమించేందుకు రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసి పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం–1989 అమలుపై ముఖ్యమంత్రి అధ్యక్షతన సచివాలయంలో మంగళవారం రాష్ట్రస్థాయి ఉన్నత నిఘా, పర్యవేక్షణ కమిటీ సమావేశం జరిగింది. రాష్ట్రంలో చట్టం అమలు, నమోదైన కేసులు, దర్యాప్తు పురోగతి, న్యాయస్థానాల్లో విచారణ, బాధితులకు ఆర్థిక సహాయం, పునరావాస చర్యలను ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తదితరులతో కలిసి సీఎం సమీక్షించారు. కేసుల విచారణ కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక న్యాయస్థానాలు, మొబైల్ కోర్టుల పనితీరుతోపాటు.. చట్టంపై చేపడుతున్న అవగాహన కార్యక్రమాలపై చర్చించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 'ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీస్ నిరోధక చట్టం' అమలుపై 2013 ఫిబ్రవరి 11న అప్పటి ముఖ్యమంత్రి అధ్యక్షతన రాష్ట్రస్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం జరిగింది. తెలంగాణ ఏర్పడ్డాక... సీఎం అధ్యక్షతన రాష్ట్రస్థాయి ఉన్నత నిఘా, పర్యవేక్షణ కమిటీ సమావేశం జరగడం ఇదే తొలిసారి అని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి.

**బాధితులకు సత్వరమే నష్టపరిహారం**

రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీలపై అట్రాసిటీ కేసులు గత ఐదేళ్లలో తగ్గుముఖం పట్టాయని అధికారులు వివరించారు. కొన్ని జిల్లాల్లో, ప్రధానంగా 73 గ్రామాల్లో ఎక్కువ కేసులు నమోదవుతున్నాయని నివేదించారు. సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. "కేసులు ఎక్కువగా నమోదవుతున్న ప్రాంతాల్లో పోలీసు విభాగం ప్రత్యేకంగా దృష్టి పెట్టాలి. జిల్లాస్థాయి విజిలెన్స్ కమిటీల సమావేశాలు క్రమం తప్పకుండా నిర్వహించాలి. బాధితులకు నష్ట పరిహారాన్ని వెంటనే చెల్లించాలి. బడ్జెట్ కేటాయింపులతో ముడిపెట్టకుండా గ్రీన్ ఛానెల్ ద్వారా నిధులు విడుదల చేయాలి. మానవీయ కోణంలో స్పందించి.. సకాలంలో సహాయం, పునరావాసం అందేలా చూడాలి" అని ఆదేశించారు. ఇటీవల షాబాద్ హత్యల కేసు, తుక్కుగూడలో నర్సుపై హత్యాచారం కేసులను సీఎం ప్రస్తావించి.. బాధిత కుటుంబాలకు సత్వర న్యాయం చేయాలని అధికారులకు నిర్దేశించారు.

# ఎడిటర్ వాయిస్

## మున్సిపల్ ఎన్నికలకు తొలి అడుగు.. అక్టోబరులో నోటిఫికేషన్!

ఏపీలో మున్సిపల్ ఎన్నికలకు ప్రభుత్వం శరవేగంగా ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే వార్డుల వారీగా ఓటర్ల జాబితాను సిద్ధం చేసిన ఎన్నికల కమిషన్ తాజాగా వార్డుల వారీగా ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓటర్లను గుర్తించనున్నారు. వీటి ఆధారంగా రిజర్వేషన్లను ఖరారు చేస్తారని అంటున్నారు. ఈ మొత్తం ప్రక్రియ పూర్తి చేసేందుకు 9 రోజుల గడువు విధించారు. దీంతో ఈ నెలాఖరులో ఎన్నికల సన్నాహక కార్యక్రమాలు పూర్తిచేసి అక్టోబరు తొలివారంలో రిజర్వేషన్లను ప్రకటిస్తారని అంచనా వేస్తున్నారు. ఇక ప్రభుత్వం శరవేగంగా ఎన్నికలకు అడుగులు వేస్తుండగా, బీసీ రిజర్వేషన్ల పెంపుతో మొత్తం రిజర్వేషన్లు 50 శాతం పరిమితిని దాటుతున్నాయని అంటున్నారు. ఇది సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు వ్యతిరేకంగా ఉండటంతో ఎవరైనా కోర్టుకు వెళితే పరిస్థితి ఏంటి అన్న చర్చ జరుగుతోంది.

రాష్ట్రంలో పట్టణ స్థానిక సంస్థల్లో వార్డుల రిజర్వేషన్లను ఖరారు చేసేందుకు ప్రభుత్వం షెడ్యూలు విడుదల చేసింది. దీంతో ఎన్నికల ప్రక్రియలో కీలక అడుగు పడినట్లుగా భావిస్తున్నారు. రాష్ట్రంలో 12 మున్సిపల్ కార్పొరేషన్లు, 29 మున్సిపాలిటీల్లో వార్డులకు మాత్రమే రిజర్వేషన్లు ఖరారు అవుతాయి. ఈ ప్రాసెస్ ద్వారా కార్పొరేషన్లు, మున్సిపాలిటీలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళ ఓటర్లను గుర్తించనున్నారని చెబుతున్నారు. ఎస్సీ, ఎస్టీ, మహిళా ఓటర్ల గుర్తింపు ప్రక్రియ బుధవారం నుంచి మూడు రోజులు పాటు జరుగుతుంది. దీనికోసం సంబంధిత సిబ్బంది డోర్ టు డోర్ సర్వే నిర్వహించనున్నారు. ఎన్నికల రోల్ ను వార్డు, పోలింగ్ స్టేషన్ వారిగా విభజించి ఓటర్లను గుర్తిస్తారని అధికారులు చెబుతున్నారు.

ఎస్టీ ఓటర్లను ఆకుపచ్చ బాల్ పాయింట్ పెన్ తోనూ, ఎస్సీ ఓటర్లను రెడ్ బాల్ పాయింట్ పెన్ తో గుర్తించాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. మహిళలు, బీసీ ఓటర్లను బ్లాక్ కలర్ బాల్ పాయింట్ పెన్ తో గుర్తించి, ఎస్సీ, ఎస్టీ, మహిళ, బీసీ ఓటర్ల ముసాయిదా జాబితాలను సెప్టెంబర్ 26న మున్సిపల్, రెవెన్యూ డివిజన్, తహసిల్దార్ కార్యాలయాల్లో నోటీస్ బోర్డుల్లో ఉంచుతారు. 27, 28 తేదీల్లో అభ్యంతరాలు, కెయిములు దాఖలు చేసేందుకు అవకాశం ఇచ్చారు. ఫారం 2 ద్వారా క్లెయిములు, ఫారం 3 ద్వారా అభ్యంతరాలను దాఖలు చేయాలి. క్లెయిములు, అభ్యంతరాలపై అబ్జెక్షన్ ఉంటే సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీ చేస్తారు.

29, 30 తేదీల్లో విచారణ నిర్వహించి ముసాయిదా జాబితాను సవరిస్తారు. అక్టోబర్ 1న ఎస్సీ, ఎస్టీ, మహిళ ఓటర్ల తుది వార్డు వారి జాబితాలను ఫారం 6 లో ప్రచురించి మునిసిపల్ పరిపాలన కమిషనర్ అండ్ డైరెక్టర్ కు అందజేస్తారు. బీసీ ఓటర్ల జాబితాకు కూడా ఇదే షెడ్యూలు వర్తిస్తుంది. ఈ ప్రక్రియ మొత్తం తొమ్మిది రోజుల్లో పూర్తి చేయాలని ప్రభుత్వ ఆదేశించింది. అయితే, మున్సిపల్ ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లకు సంబంధించి న్యాయపరమైన చిక్కులు అవరోధం కావచ్చునున్న అభిప్రాయం వ్యక్తం అవుతుంది.

### న్యాయపరమన చిక్కులు తప్పవా?

మున్సిపాలిటీలో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గతంలో విడుదల చేసిన జీవో న్యాయపరంగా నిలబడదని నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు. గతంలో సుప్రీంకోర్టు ధర్మాసనం ఇచ్చిన తీర్పు ప్రకారం రిజర్వేషన్ల శాతం 50 కు మించకూడదు. అయితే, ఇప్పుడు బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న నిర్ణయంతో ఇది 54 శాతానికి చేరుతుంది. దీనివల్ల న్యాయపరమైన అవరోధాలు ఏర్పడి మొత్తం ఎన్నికల ప్రక్రియనే ప్రశ్నార్థకంగా మారుస్తుందని నిపుణులు చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం ఎలా ముందుకెళ్తుందో వేచి చూడాల్సి వుందని అంటున్నారు.



ఎడిటర్ : కె.సునీల్‌కుమార్

# క్రైమ్ వాయిస్

## పింఛన్ మంజూరుకు రూ.15 వేల లంచం డిమాండ్

### అనిశాకు చిక్కిన ఇద్దరు



**నిజామాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** పింఛన్ మంజూరుకు లంచం డిమాండ్ చేసిన ఇద్దరు నిజామాబాద్ నగరపాలక ఉద్యోగులు సోమవారం అవినీతి నిరోధక శాఖ(అనిశా)కు పట్టుబడ్డారు. అనిశా అధికారుల వివరాల ప్రకారం.. కార్పొరేషన్ పరిధిలో పనిచేసి, పదవీ విరమణ పొందిన ఓ పారిశుద్ధ్య కార్మికురాలు పింఛన్ కోసం దరఖాస్తు చేశారు. ఆ దరఖాస్తును పరిశీలించి పింఛన్ మంజూరు చేయించేందుకు కార్పొరేషన్ ఎస్టాబ్లిష్‌మెంట్ విభాగం జూనియర్ అసిస్టెంట్ పాల్ద అశోక్, ఆడిట్ విభాగం ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి కలకుంట కిరణ్‌కుమార్‌లు రూ.15 వేలు డిమాండ్ చేశారు. దీంతో కార్మికురాలు తన కుమారుడి సాయంతో అనిశాను ఆశ్రయించారు. ముందస్తు ప్రణాళిక ప్రకారం ఉదయం 11.20 గంటల సమయంలో సీతారామకాలనీ పద్మశాలి సంఘం భవనం వద్ద అశోక్, కిరణ్‌కుమార్‌లు లంచం తీసుకుంటుండగా, అక్కడే కాపు కాసిన అనిశా బృందం రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుంది. నిందితులను అరెస్టు చేశామని, హైదరాబాద్ నాంపల్లిలోని ప్రత్యేక కోర్టు ఎదుట హాజరుపరుస్తామని అనిశా నిజామాబాద్ ఇన్‌ఛార్జి డీఎస్పీ సుదర్శన్ వెల్లడించారు. సంబంధిత సెక్షన్ కార్యాలయానికి ఉద్యోగులను తీసుకెళ్లి రికార్డులను తనిఖీ చేశామన్నారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని తెలిపారు.

## ఆర్టీసీ బస్సు బోల్తా.. 20 మందికి తీవ్ర గాయాలు



**వాల్మీకిపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** అన్నమయ్య జిల్లాలో టైరు పంక్చరై ఆర్టీసీ బస్సు బోల్తాపడింది. వాల్మీకిపురం మండలం విఠలం వద్ద ఈ ఘటన చోటు చేసుకుంది. ప్రమాదంలో 20 మంది ప్రయాణికులకు తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మదనపల్లె ఆర్టీసీ డిపోనకు చెందిన నాన్‌స్టాప్ బస్సు మంగళవారం ఉదయం తిరుపతికి బయల్దేరింది. వాల్మీకిపురం మండలం విఠలం సమీపంలో మదనపల్లె-తిరుపతి హైవేపై ప్రయాణిస్తుండగా టైరు పంక్చర్ కావడంతో పక్కనే ఉన్న కల్వర్టులోకి వెళ్లి బస్సు బోల్తాపడింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన 20 మందిని వాల్మీకిపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వీరిలో కొంతమందిని ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఎస్సై తిప్పేస్వామి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## పెళ్లి పేరుతో ఐటీ యువతులకు వల..

### రూ.కోట్లు కాజేసిన కామేష్‌పై పీడీయాక్ట్



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** మ్యాట్రిమోని సైట్లలో రిజిస్టర్ చేసుకుని.. యువతులను రూ.కోట్లలో మోసం చేస్తున్న వెంకట కామేష్ అలియాస్ కార్తీక్‌రెడ్డిపై పోలీసులు పీడీ యాక్ట్ ప్రయోగించారు. పశ్చిమ గోదావరి జిల్లా ఉండ్రాజవరం మండలం మోర్త గ్రామానికి చెందిన చెందిన మండ వెంకట కామేష్‌పై బీటెక్ చదివాడు. మ్యాట్రిమోని వెబ్‌సైట్లలో తనను తాను బాగా డబ్బున్న ఎన్ఆర్ఐగా పరిచయం చేసుకునేవాడు. ఆ తర్వాత వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచయం పెంచుకుని, నమ్మకం కుదిరిన తర్వాత అత్యవసరాల పేరుతో బాధితుల నుంచి భారీగా డబ్బులు గుంజేవాడు. తెలుగు రాష్ట్రాల్లో ఇప్పటి వరకు ఇతనిపై 19 కేసులు నమోదయ్యాయి. కామేష్ చేతిలో మోసపోయిన వారిలో ఎక్కువ మంది ఐటీ ఉద్యోగులే ఉన్నట్లు పోలీసులు తెలిపారు. బాధితుల బ్యాంక్ వివరాలు, ఓటీపీలు, క్రెడిట్ కార్డ్ వివరాలను సేకరించి ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు కూడా ఆ డబ్బును ఉపయోగించినట్లు పోలీసులు గుర్తించారు. బాధితుల సంఖ్య పెరుగుతుండటంతో సైబరాబాద్ పోలీస్ కమీషనరేట్ పరిధిలో కామేశ్‌పై పీడీ యాక్ట్ కింద కేసు నమోదు చేసి, చర్లపల్లి కేంద్ర కారాగారానికి తరలించారు.

## సాంబారు పాత్రలో పడి మహిళ మృతి

### వినాయక నిమజ్జనానికి వంట చేస్తుండగా ప్రమాదం



**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రమాదవశాత్తు సాంబారు పాత్రలో పడి గాయాలపాలై చికిత్స పొందుతూ మహిళ సోమవారం మృతిచెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడలోని కేఎల్‌రావునగర్ ఐదో వీధికి చెందిన మద్ది సుజాత(46) తన చిన్న కుమారుడి వద్ద ఉంటున్నారు. ఈనెల 20న ఇంటి సమీపంలోని వినాయక విగ్రహ నిమజ్జనం నేపథ్యంలో అన్నదానం నిమిత్తం బంధువులతో కలిసి వంటలు చేస్తున్నారు. పొయ్యిపై ఉన్న సాంబారు పాత్రను దింపుతుండగా తూలి అందులో పడ్డారు. ముఖం, ఛాతీ, శరీరమంతా కాలిపోయి తీవ్రగాయాలయ్యాయి. ఆమెను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సుజాత మృతిచెందారు.

## వేరుశనగ రైతులకు ఉపయోగపడే

# డ్రమ్ రోలింగ్ టెక్నిక్



**తక్కువ ఖర్చుతో.. ఎక్కువ దిగుబడికి**

వేరుశనగ పంటలో అధిక దిగుబడి కోసం రైతులు డ్రమ్ రోలింగ్ పద్ధతిని పాటిస్తున్నారు. 40–50 రోజుల పయసున్న పంటలో ప్లాస్టిక్ డ్రమ్ ఖాళీగా లేదా కాస్త ఇసుక, రాళ్లను నింపి రోలింగ్ చేస్తారు. దీనివల్ల ఎత్తుగా పెరిగిన కొమ్మలు భూమికి దగ్గరై, వాటి నుండి వచ్చే ఊడలు నేలలోకి చొచ్చుకుపోయి ఎక్కువ కాయలుగా మారుతాయి.

### డ్రమ్ రోలింగ్ అంటే ఏమిటి?

డ్రమ్ రోలింగ్‌లో సాధారణంగా ఒక ఖాళీ ప్లాస్టిక్ డ్రమ్‌ను ఉపయోగిస్తారు. దానిని పొలంలో వేరుశనగ ముక్కలపై నెమ్మదిగా రోల్ చేస్తారు. అయితే డ్రమ్‌కు ఎంత బరువు ఉండాలి, ఎప్పుడు రోల్ చేయాలి అనే విషయం పంట దశ, నేల పరిస్థితి, స్థానిక వ్యవసాయ సిఫార్సులను బట్టి నిర్ణయించాలి.



ప్లాస్టిక్ డ్రమ్

### డ్రమ్ రోలింగ్ ఎలా ఉపయోగపడుతుంది?

- పంటలో కొమ్మలు నేలకు దగ్గరగా ఉండేలా చేయడంలో సహాయపడుతుంది.
- దీంతో ఊడలు నేలను చేరి మట్టిలోకి చొచ్చుకుపోయే అవకాశం పెరుగుతుంది.
- తద్వారా కాయల ఏర్పాటుకు అనుకూల పరిస్థితులు ఏర్పడవచ్చు.

### డ్రమ్ రోలింగ్ పద్ధతి – దశల వారీగా



1. డ్రమ్‌ను ఖాళీగా లేదా కాస్త ఇసుక, రాళ్లతో నింపాలి.
2. 40-50 రోజుల వయసున్న పంటలో నెమ్మదిగా రోల్ చేయాలి.
3. ఊడలు నేలలోకి చొచ్చుకుపోయి కాయలుగా మారుతాయి.

### ఎలా జరుగుతుంది?



పువ్వులు ఏర్పడిన తర్వాత పెగ్స్ (ఊడలు) నేల వైపు పెరుగుతాయి. → డ్రమ్ రోలింగ్ వల్ల కొమ్మలు నేలకు దగ్గరగా వస్తాయి. → ఊడలు మట్టిలోకి చొచ్చుకుపోయి కాయలుగా అభివృద్ధి చెందుతాయి.

### ఎప్పుడు చేయాలి?

ICAR వ్యవసాయ సలహాలో కూడా పుష్పాలు ప్రారంభమైన తర్వాత 8–10 రోజులకు మొక్క మడలు చుట్టూ మట్టిని కప్పి, దాని తర్వాత 15 రోజులకుధాను ఖాళీ డ్రమ్ లేదా కాస బరువు నింపిన డ్రమ్‌ను పంటపై రోల్ చేయమని సూచించారు.

### 40–50 రోజుల్లోనే చేయాలా?

అన్ని పంటలకు ఒకే విధంగా వర్తించే నియమం కాదు. పంట రకం, పుష్పించే దశ, నేల పరిస్థితి, వాతావరణాన్ని బట్టి సమయం మారవచ్చు. కాబట్టి పంట దశను గమనించి, స్థానిక వ్యవసాయ అధికారుల సూచనల మేరకు చేయాలి.

### గుర్తుంచుకోవాల్సిన ముఖ్యమైన అంశాలు

- మంచి విత్తనం
- సరైన నేల సిద్ధం
- సమతుల్య ఎరువులు
- కలుపు-తెగుళ్ల నియంత్రణ
- తగినంత తేమ

### రైతులకు ఉపయోగకరమైన పద్ధతి

డ్రమ్ రోలింగ్‌ను సరైన దశలో, సరైన పద్ధతిలో చేస్తే వేరుశనగలో పెగ్స్ నేలను చేరిందుకు సహాయపడుతుంది. దీనినే ఒక్కటే ఆధారంగా చేసుకుని దిగుబడి పెరుగుతుందని చెప్పలేం. ఇది వేరుశనగ సాగులో ఉపయోగపడే ఒక సహాయక వ్యవసాయ పద్ధతి మాత్రమే.

**సరైన పద్ధతి + సరైన సమయలో = మంచి దిగుబడి**

# విశ్వ వాయిస్
అవినీతిపై - అక్షర సమరం...
VISWAMVOICE TELUGU DAILY

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎడిషన్లు




బుధవారం, 23 సెప్టెంబర్, 2026

www.viswamvoice.com

సత్యం • సమగ్రం • సమాజ బాధ్యత www.viswamvoice.com







# పిఠాపురం అభివృద్ధికి రూ.1500 కోట్ల పనులు

## మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే లక్ష్యం - త్వరలో పిఠాపురంలో డిప్యూటీ సీఎం క్యాంప్ కార్యాలయం

**పిఠాపురం, సెప్టెంబరు 22, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్‌శాఖ మంత్రి, పిఠాపురం ఎమ్మెల్యే పవన్ కల్యాణ్ పిఠాపురం నియోజకవర్గంలో రెండు రోజుల పాటు విస్తృతంగా పర్యటించారు. నియోజకవర్గ సమగ్ర అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిన ఆయన.. వివిధ ప్రాంతాల్లో అభివృద్ధి పనులను ప్రారంభించడంతో పాటు పలు ప్రాజెక్టులకు శంకుస్థాపనలు చేశారు. ఈ పర్యటనలో సుమారు రూ.1,500 కోట్ల విలువైన అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు అధికారులు, ప్రజాప్రతినిధులు వెల్లడించారు.

**చెరువుల సుందరీకరణకు ప్రాధాన్యం**

పర్యటన తొలి రోజున ఎఫ్.కె.పాలెంలో మైసమ్మ చెరువు అభివృద్ధి పనులను పవన్ కల్యాణ్ ప్రారంభించారు. సుమారు రూ.73 లక్షలతో చెరువును అభివృద్ధి చేసి వాకింగ్ ట్రాక్, ఓపెన్ ఎయిర్ జిమ్, చిల్డ్రన్ పార్కు వంటి సౌకర్యాలను ఏర్పాటు చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో చెరువులను కేవలం నీటి వనరులుగా కాకుండా ప్రజలకు ఆరోగ్యం, విశ్రాంతి, ఆహ్లాదం అందించే సామాజిక కేంద్రాలుగా అభివృద్ధి చేయాలన్న ఉద్దేశంతో ఈ కార్యక్రమాలు చేపడుతున్నట్లు పవన్ తెలిపారు. నియోజకవర్గంలో రూ.6 కోట్లకు పైగా వ్యయంతో సుందరీకరించిన పలు చెరువులను కూడా ఆయన ప్రారంభించారు. చెరువుల చుట్టూ పచ్చదనం, వాకింగ్ ట్రాక్‌లు, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంపై అధికారులు దృష్టి సారించారు.

**పీఠికాపుర వనం ప్రారంభం**

పిఠాపురంలో ఆరు ఎకరాల విస్తీర్ణంలో రూ.1.83 కోట్లతో అభివృద్ధి చేసిన 'పీఠికాపుర వనం'ను పవన్ కల్యాణ్ ప్రారంభించారు. నగరవన్ యోజనలో భాగంగా చేపట్టిన ఈ వనంలో వివిధ రకాల మొక్కలు, మియావకీ ఫారెస్ట్, బటర్‌ఫ్లై పార్కు తదితర ఏర్పాట్లను పరిశీలించారు. మొక్కల శాస్త్రీయ పేర్లు, వాటి వినియోగంపై ఏర్పాటు చేసిన సమాచార ఫలకాలను కూడా ఆయన పరిశీలించారు.

**తాగునీరు, రహదారులపై దృష్టి**

యు.కొత్తపల్లిలో నాగులపల్లి సీపీడబ్ల్యూఎస్ మంచినీటి పథకాన్ని ప్రారంభించడంతో పాటు కొండేవరం గ్రామంలో ఇంటింటికీ కుళాయి కనెక్షన్లను పవన్ కల్యాణ్ పరిశీలించారు. రెండో రోజు గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో రహదారి నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు.

**పిఠాపురంలో భారీ బహిరంగ సభ**

రెండో రోజు పిఠాపురం ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడామైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగ



సభలో పవన్ కల్యాణ్ ప్రసంగించారు. పిఠాపురం ప్రజలు తనను ఎమ్మెల్యేగా గెలిపించడం తన రాజకీయ ప్రయాణంలో కీలక ఘట్టమని పేర్కొంటూ, టీడీపీ, బీజేపీ, జనసేన కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. పిఠాపురాన్ని దేశంలోనే ఒక మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు పనిచేస్తున్నానని చెప్పారు. ఉప్పాడ తీర ప్రాంత రక్షణ గోడ నిర్మాణానికి సంబంధించి కేంద్రస్థాయిలో అనుమతులు తీసుకురావడానికి తాను చొరవ తీసుకున్నానని పవన్ కల్యాణ్ తెలిపారు. పిఠాపురం ఆధ్యాత్మికంగానూ, మౌలిక వసతుల పరంగానూ అభివృద్ధి చెందేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

**కూటమి సమన్వయంపై పిలుపు**

కూటమి భాగస్వామ్య పక్షాలు సమన్వయంతో పనిచేయాలని పవన్ కల్యాణ్ సూచించారు. జనసేన గౌరవానికి భంగం కలగకుండా కూటమి పార్టీలు కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల ప్రాథమిక అవసరాలను ముందుగా తీర్చిన అనంతరం వారి ఆకాంక్షలను నెరవేర్చేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

**క్యాంప్ కార్యాలయం ఏర్పాటు**

పిఠాపురం ప్రజలకు మరింత అందుబాటులో ఉండేందుకు త్వరలో నియోజకవర్గంలోనే తన క్యాంప్ కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తానని పవన్ కల్యాణ్ ప్రకటించారు. జనసేన ఫైవ్ మ్యాన్ కమిటీ పనితీరుపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేస్తూ, ప్రజల సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా నేరుగా పర్యవేక్షించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. క్యాంప్ కార్యాలయం పూర్తిస్థాయిలో ఏర్పాటు కావడానికి మూడు నుంచి నాలుగు నెలలు పట్టవచ్చని తాజా నివేదికలు పేర్కొంటున్నాయి.

**పవన్‌ను కలిసిన సహారా ప్రతినిధులు**

పర్యటన సందర్భంగా సహారా ఫీల్డ్ వర్కర్స్ అండ్ డిపాజిటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు పవన్ కల్యాణ్‌ను కలిసి తమ సమస్యలను వివరించారు. తమకు రావాల్సిన నిధుల సమస్యను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. పవన్ వారి సమస్యలను విన్నారు.

**జనసేనలోకి వైసీపీ నేతల చేరిక**

పర్యటన తొలి రోజున మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావుతో పాటు పలువురు వైసీపీ నేతలు పవన్ కల్యాణ్ సమక్షంలో జనసేనలో చేరారు. పిఠాపురం, పెద్దాపురం, సామర్లకోట, జగ్గంపేట ప్రాంతాలకు చెందిన పలువురు మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు కూడా పార్టీలో చేరినట్లు వార్తా సంస్థలు పేర్కొన్నాయి. ఒక నివేదిక ప్రకారం మొత్తం 32 మంది నేతలు జనసేనలో చేరారు.

**స్థానిక ఎన్నికలపై దృష్టి**

పిఠాపురం పర్యటనతో అభివృద్ధి కార్యక్రమాలతో పాటు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో జనసేన రాజకీయ కార్యకలాపాలకు కూడా ప్రాధాన్యం ఏర్పడింది. ఈ అంశంపై కాకినాడలో పార్టీ కీలక సమావేశం నిర్వహించనున్నట్లు పర్యటన షెడ్యూల్‌కు సంబంధించిన నివేదికలు పేర్కొన్నాయి. మొత్తంగా, పవన్ కల్యాణ్ పిఠాపురం పర్యటనలో తాగునీరు, రహదారులు, చెరువుల అభివృద్ధి, పచ్చదనం, నగరవనం, గ్రామీణ మౌలిక వసతులు వంటి అంశాలకు ప్రాధాన్యం లభించింది. అదే సమయంలో ప్రజలకు మరింత చేరువగా ఉండేందుకు పిఠాపురంలో క్యాంప్ కార్యాలయం ఏర్పాటు చేస్తానన్న ప్రకటన రాజకీయంగానూ, పరిపాలనా పరంగానూ ఈ పర్యటనలో ప్రధాన అంశంగా నిలిచింది.

# రైతులకు ఫార్మర్ ఐడీ తప్పనిసరి

## 24వ పీఎం కిసాన్ నిధులకు ఇదే కీలకం- మండల సర్వసభ్య సమావేశంలో అధికారుల వెల్లడి




**రాయవరం, సెప్టెంబర్ 22, విశ్వం వాయిస్ న్యూస్ :** మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో సన్మాన కార్యక్రమాలు ముగిసిన అనంతరం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో పలు శాఖలకు చెందిన అధికారులు సమావేశానికి గైర్హాజరైనప్పటికీ, హాజరైన అధికారులు తమ శాఖల పరిధిలోని అంశాలను సభ దృష్టికి తీసుకువచ్చారు. రైతులు, గృహ నిర్మాణాలు, డ్రైనేజీ తదితర అంశాలపై అధికారులు వివరాలు వెల్లడించారు. మండల వ్యవసాయ అధికారి రమేష్‌కుమార్ మాట్లాడుతూ మండలంలో రైతు పంట నమోదు ప్రక్రియ 100 శాతం పూర్తయిందని తెలిపారు. రైతులకు ఫార్మర్ ఐడీ అందించే ప్రక్రియ 70 శాతం పూర్తయిందన్నారు. 24వ విడత పీఎం కిసాన్ నిధులు జమ కావాలంటే రైతులకు ఫార్మర్ ఐడీ తప్పనిసరిగా ఉండాలని వివరించారు. అదేవిధంగా రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయడానికి కూడా ఫార్మర్ ఐడీ అవసరమని తెలిపారు. గృహ నిర్మాణాలపై హౌసింగ్ ఇన్‌చార్జి ఏఈ కే.అనురాధ మాట్లాడుతూ మండలంలో 440 మంది లబ్ధిదారులకు గృహ నిర్మాణాల కోసం రుణాలు అవసరం కాగా, ఇప్పటివరకు 374 మందికి మంజూరైనట్లు వెల్లడించారు. రుణాలు మంజూరైన లబ్ధిదారులు శాంక్షన్ అయిన వెంటనే గృహ నిర్మాణ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. డ్రైనేజీ ఏఈ సందీప్ మాట్లాడుతూ మేజర్ డ్రైనేజీల గట్లపై పంచాయతీ సిబ్బంది చెత్తను తరలించి కాల్చవద్దని సూచించారు. చెత్తను కాల్చడం వల్ల పర్యావరణానికి, డ్రైనేజీ వ్యవస్థకు నష్టం కలిగే అవకాశం ఉందన్నారు. పంట కాలువలను దెబ్బతీయకుండా అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో మండపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చింతపల్లి రామకృష్ణ, ఎంపీడీవో మూర్తి, ఏవో వైఎస్ఎన్ గోపాల్, మండలంలోని వివిధ గ్రామాల ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**కాకినాడ గేట్‌వే పోర్ట్ వద్ద**

# 'సముద్ర మంథన్' ప్రాజెక్ట్ కోసం అధికారుల స్థల పరిశీలన



**కాకినాడ, సెప్టెంబర్ 22, విశ్వం వాయిస్ న్యూస్ :** భారతదేశ తీరప్రాంతాల్లో సముద్ర గర్భ చమురు, సహజ వాయువు అన్వేషణను మరింత వేగవంతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'సముద్ర మంథన్' పథకంలో భాగంగా, మంగళవారం కాకినాడ గేట్‌వే పోర్ట్ ను రాష్ట్ర పరిశ్రమల వాణిజ్య శాఖ కార్యదర్శి యువరాజ్, కాకినాడ సంయుక్త కలెక్టర్ అపూర్వ భరత్ తో కూడిన ఉన్నతాధికారుల బృందం మంగళవారం స్థల పరిశీలన చేపట్టింది. ఈ సందర్భంగా అధికారుల బృందం కాకినాడ గేట్‌వే పోర్ట్, కాకినాడ ప్రత్యేక ఆర్థిక మండలి ప్రాంతాలను ప్రత్యక్షంగా సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాలు, రవాణా సౌకర్యాలు, మరియు భూమి లభ్యత తదితర కీలక అంశాలపై అధికారులు పరిశీలించి అధికారులు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ పర్యటనలో భాగంగా, కాకినాడ గేట్‌వే పోర్ట్ మేనేజింగ్ డైరెక్టర్ రామ్ రెడ్డి ఓజిలి, ప్రత్యేక ఆర్థిక మండలి అధిపతి మంథా శ్రీనివాస్ సారథ్యంలోని బృందం అధికారులకు ప్రాజెక్ట్‌కు సంబంధించిన వివరాలను అధికారులకు సమగ్రంగా వివరించారు. ఈ ప్రతిపాదిత జాతీయ ప్రాజెక్ట్ విజయవంతం కావడానికి తమ వంతు పూర్తి సహకారాన్ని అందిస్తామని కేజీపీఎల్ యాజమాన్యం స్పష్టం చేసింది. వేల కోట్ల రూపాయల భారీ పెట్టుబడితో కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన ఈ 'సముద్ర మంథన్' పథకం ద్వారా దేశంలో ఇంధన అన్వేషణ కార్యకలాపాలు ఊపందు కుంటాయని తద్వారా ఈ ప్రాంతం పారిశ్రామికంగా మరింత అభివృద్ధి చెందుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ పరిశీలనలో స్థానిక రెవెన్యూ, సర్వే అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# తుని నియోజకవర్గంలో వైసీపీకి భారీ షాక్

## జనసేనలో చేరేందుకు పలువురు కీలక నేతలు సిద్ధం?



**కోటనందూరు, సెప్టెంబర్ 22, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా తుని నియోజకవర్గం వైసీపీ నేత యనమల కృష్ణుడు పార్టీని వీడి జనసేనలో చేరనున్నట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. వైసీపీ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజాతో సఖ్యత లేకపోవడమే యనమల కృష్ణుడు పార్టీని వీడడానికి ప్రధాన కారణమని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. యనమల కృష్ణుడితో పాటు తుని మండల మాజీ ఎంపీపీ పోల్నాటి శేషగిరిరావు, మాజీ సర్పంచ్, తొండంగి మండలం వైసీపీ అధ్యక్షుడు బత్తుల వీరబాబు, వైసీపీ సీనియర్ నాయకుడు పేకేటి హరికృష్ణ, మరో సీనియర్ నాయకుడు దిబ్బ శ్రీను, గతంలో వైసీపీ సోషల్ మీడియా జిల్లా అధ్యక్షుడిగా పనిచేసిన అడపా సురేష్ కూడా జనసేనలో చేరనున్నట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.వీరితో పాటు మాజీ సర్పంచులు, ఇతర ప్రజాప్రతినిధులు, పలువురు స్థానిక వైసీపీ నాయకులు కూడా జనసేనలో చేరేందుకు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. ఈ చేరికలన్నీ ఈరోజు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సమక్షంలో జరిగే అవకాశం ఉన్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. అయితే, ఎవరెవరు అధికారికంగా జనసేనలో చేరుతారనే అంశంపై స్పష్టత రావాల్సి ఉంది.

**పిఠాపురం నియోజకవర్గ సర్వతోముఖాభివృద్ధే లక్ష్యంగా**

# డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కృషి

**పిఠాపురం, సెప్టెంబర్ 22, విశ్వం వాయిస్ న్యూస్ :** పిఠాపురం నియోజకవర్గ సర్వతోముఖాభివృద్ధే లక్ష్యంగా ఉప ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ తెలిపారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ రెండు రోజుల పిఠాపురం పర్యటన నేపథ్యం లో రెండో రోజు మంగళ వారం జరిగిన బహిరంగ సభలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎల్ నినో ప్రభావం ఉన్నప్పటికీ సాగునీటి సరఫరా లో ఎలాంటి ఇబ్బందులు రాకుండా ప్రత్యేక చర్యలు చేపట్టడం జరిగిందన్నారు.రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా కేవలం ఒక్క పిఠాపురం నియోజక వర్గంలోనే వేల ఎకరాలకు సాగునీరు అందించేలా ప్రత్యేక దృష్టి సారించినట్లు వెల్లడించారు.మత్స్యకార కుటుంబాల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, సముద్ర వేటకు ప్రాణాలకు తెగించి వెళ్లే మత్స్యకారుల భద్రత కోసం ప్రత్యేక పరికరాలను పంపిణీ చేస్తూ వారికి కొండంత అండగా నిలుస్తున్నట్లు తెలిపారు పిఠాపురం నియోజక వర్గంలో సుమారు 230 కోట్ల రూపాయల భారీ వ్యయం తో పెద్ద నగరాలకే ఆదర్శం గా నిలిచే రీతిలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయని కలెక్టర్ వివరించారు. అలాగే, జలజీవన్ మిషన్

**జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్**



అమృత్ 2.0 పథకాల ద్వారా నియోజక వర్గంలోని ప్రతి ఒక్కరికీ తలసరి రోజువారీ 55 లీటర్ల శుద్ధ తాగునీరు అందించే లక్ష్యంతో పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. పిఠాపురం నియోజక వర్గాన్ని అన్ని రంగాలలోనూ రాష్ట్రంలోనే ముందంజలో ఉంచేందుకు ఉప ముఖ్య మంత్రి వర్యుల లక్ష్యానికి అనుగుణంగా అంకిత భావంతో జిల్లా అధికార యంత్రాంగం నిరంతర కృషి చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ వివరించారు.




విశ్వం వాయిస్
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎడిషన్
బుధవారం, 23 సెప్టెంబర్ 2026
www.viswamvoice.com





# అభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన అజెండా

## మంత్రి వాసంశెట్టి సుభాష్



**ద్రాక్షారామ, సెప్టెంబర్ 22, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను మరింత వేగవంతం చేసి ప్రజలకు మెరుగైన పాలన అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ స్పష్టం చేశారు. అభివృద్ధి విషయంలో ఎక్కడా రాజీపడే ప్రసక్తే లేదని, విధుల్లో అలసత్వం ప్రదర్శించే అధికారులను ఉపేక్షించేది లేదని తేల్చిచెప్పారు. ద్రాక్షారామలోని కన్యకా పరమేశ్వరి ఫంక్షన్ హాల్‌లో మంగళవారం కూటమి పార్టీ నేతలు, వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. గత మూడు రోజులుగా గంగవరం, కాజులూరు, రామచంద్రపురం మండలాల అధికారులతో వరుసగా సమావేశాలు నిర్వహిస్తూ నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలుతీరుపై మంత్రి సమగ్రంగా సమీక్షించారు. రామచంద్రపురాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలపడమే తన తక్షణ కర్తవ్యమని, ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా అధికారులు, కూటమి నాయకులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీ సీనియర్ నేత వాసంశెట్టి సత్యం, ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, జనసేన ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ మాట్లాడుతూ.. గత ఐదేళ్లలో కుంటుపడిన అభివృద్ధి కూటమి ప్రభుత్వ హయాంలో వేగవంతమైందని, సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్‌ల నేతృత్వంలో రాష్ట్రాన్ని సువర్ణ ఆంధ్ర ప్రదేశ్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో తహసీల్దార్ బండి మృత్యుంజయరావు, ఎంపీడీవో పద్మజ్యోతి, కూటమి నాయకులు కొత్తపల్లి శ్రీనుబాబు, పెంకే అన్నపూర్ణ, పెంకే సాంబశివరావు, కొత్తపల్లి అరుణ, ఆకేటి శ్రీకృష్ణ, పలివెల ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో పర్యటిస్తే పీజిఆర్ఎస్

# సమస్యలు పరిష్కారం అవుతాయి

## డివిజన్ మండల స్థాయి అధికారులకు కలెక్టర్ దిశా నిర్దేశం



**అమలాపురం, సెప్టెంబర్ 22, విశ్వం వాయిస్ న్యూస్ :** క్షేత్రస్థాయిలో పర్యటిస్తే పీజిఆర్ఎస్ సమస్యలు పరిష్కారం అవుతాయని డివిజన్ మండల స్థాయి అధికారులకు జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ దిశా నిర్దేశం చేశారు. మంగళవారం రాష్ట్ర సచివాలయం నుండి చీఫ్ సెక్రటరీ జి.సాయి ప్రసాద్, భూ ప్రధాన పరిపాలన అధికారి జయలక్ష్మి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో 22 ఎ నిషేధిత భూములు, రీ సర్వే, రెవిన్యూ క్లినిక్, డిజిటలైజేషన్ ఆఫ్ రెవిన్యూ రికార్డ్స్, పిపిబి డిస్ట్రిబ్యూషన్, ఐవిఆర్ఎస్, మడ అడవుల పరిరక్షణ,ఓఆర్ సిఎం వంటి అంశాలపై సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పర్యటిస్తే పి జి ఆర్ ఎస్ సమస్యలు పరిష్కారం అవుతాయని, జిల్లాలో డివిజన్ మండల స్థాయి అధికారులు అర్జీదారుడు సమస్యను క్షుణ్ణంగా పరిశీలించి వెంటనే ఎండార్స్మెంట్ రూపంలో తెలియజేయాలని కలెక్టర్ తెలియజేశారు. అదేవిధంగా 22ఎ నిషేధిత భూముల రీ సర్వే పనులు వేగవంతం చేసి వాటి పరిష్కార మార్గాలపై తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. రీ- సర్వే పనులపై జాప్యం లేకుండా వెంటనే పరిష్కరించి, డిజిటలైజేషన్ ఆఫ్ రెవిన్యూ రికార్డ్స్ లో పొందుపరచాలని కలెక్టర్ తెలియజేశారు. ఆన్లైన్ ద్వారా వచ్చే అర్జీలను డిజిటలైజేషన్ చేసి వెంటనే పరిష్కార మార్గాలు చూపాలని కలెక్టర్ తెలిపారు. సముద్ర తీర ప్రాంత మడ అడవుల భూములను రీ సర్వే చేసి వాటి పనులను వేగవంతం చేయాలని తెలియజేశారు. ఒఆర్సిఎం వచ్చే ఆన్లైన్ అర్జీలను ఎండార్స్మెంట్ రూపంలో తెలియజేసి పరిష్కార మార్గాలు చూపాలని తెలియజేసారు. ఈ సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి వి.సుబ్బారావు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అమలాపురంలో అలరించిన చిన్నారుల నృత్య ప్రదర్శనలు

## నరసింహావతార ఘట్టం ప్రత్యేక ఆకర్షణ



**అమలాపురం, సెప్టెంబర్ 22, విశ్వం వాయిస్ న్యూస్ :** వినాయక చవితి నవరాత్రుల సందర్భంగా అమలాపురం మండలం ఇందుపల్లి గ్రామానికి చెందిన రామాంజనేయ నృత్య అకాడమీ విద్యార్థులు కోనసీమ వ్యాప్తంగా నిర్వహిస్తున్న నృత్య ప్రదర్శనలు భక్తులను అలరిస్తున్నాయి. అకాడమీకి చెందిన చిన్నారులు వినాయక చవితి నవరాత్రుల్లో ప్రతిరోజూ కోనసీమలోని వివిధ ప్రాంతాల్లో నృత్య ప్రదర్శనలు ఇస్తున్నారు. గతంలో పలు ప్రసిద్ధ పుణ్యక్షేత్రాల్లో ప్రదర్శనలు ఇచ్చిన చిన్నారులు, ఈ నవరాత్రుల్లో అమలాపురం కూరగాయల మార్కెట్, పాలగుమ్మి, కాట్రేనికోన గేటు సెంటర్, సాకుర్రు గ్రామంలోని బాల భక్త గణపతి మందిరం వద్ద నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. ఈ ప్రదర్శనల్లో అకాడమీ నిర్వాహకుడు నాగిరెడ్డి దుర్గాప్రసాద్ రూపొందించిన 'నరసింహస్వామి హిరణ్యకశిపుని సంహరించిన ఘట్టం' నృత్య నాటకం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. చిన్నారులు తమ నృత్యాభినయంతో ఈ ఘట్టాన్ని ప్రదర్శించడంతో భక్తులు విశేషంగా ఆకట్టుకున్నారు. అనంతరం ప్రదర్శనలో పాల్గొన్న చిన్నారులందరికీ మెమెంటోలు అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా పండితుడు గోవిందువర్తుల నాగ భాస్కర శర్మ మాట్లాడుతూ నృత్యశ్రీ, నాట్యశౌర్య వంటి పలు పురస్కారాలు అందుకున్న నాగిరెడ్డి దుర్గాప్రసాద్‌ను అభినందించారు. 100 మందికి పైగా చిన్నారులకు భరతనాట్యం, కూచిపూడి నృత్యాల్లో శిక్షణ ఇచ్చి వారిని ప్రతిభావంతులుగా తీర్చిదిద్దడం అభినందనీయమన్నారు. చదువుతో పాటు కళలను అభ్యసిస్తున్న చిన్నారులను, వారికి ప్రోత్సాహం అందిస్తున్న తల్లిదండ్రులను అభినందించారు. కూచిపూడి నృత్యంలో శిక్షణ పొందడం వల్ల పిల్లల్లో ఆధ్యాత్మిక భావనతో పాటు శారీరక ఆరోగ్యం కూడా మెరుగుపడుతుందని అకాడమీ నిర్వాహకుడు నాగిరెడ్డి దుర్గాప్రసాద్ తెలిపారు. ప్రస్తుతం తమ అకాడమీలో 100 మందికి పైగా చిన్నారులు శిక్షణ పొందుతున్నారని, చదువుతో పాటు నృత్య ప్రదర్శనలు ఇస్తూ పలు బహుమతులు సాధిస్తున్నారని తెలిపారు. నృత్య ప్రదర్శనలో భోద్విని, నోహిత, దేనుక, ఋషితాంభిక, కార్తీక, శ్రీవల్లి, ధృతి, జాహ్నవి, సిరి, స్వీటీ, ప్రణతి, తేజు, లాస్య, ప్రణీత, లావణ్య, నవీన్, వికాస్, సర్వన్, సింధు, సుమెదా, సృజన తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల రహిత యువ భారతే లక్ష్యంగా

# ద్రాక్షారామంలో భారీ అవగాహన ర్యాలీ

## హాజరైన మంత్రి వాసంశెట్టి సుభాష్



**ద్రాక్షారామ, సెప్టెంబర్ 22, విశ్వం వాయిస్ న్యూస్ :** డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం ద్రాక్షారామలో 25 ఏళ్ల మోదీ సేవా సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా మాదకద్రవ్యాల రహిత యువ భారత్ అవగాహన ర్యాలీ ఘనంగా నిర్వహించారు. జిల్లా సేవా సంకల్ప అభియాన్ కన్వీనర్, కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి నాగిరెడ్డి సతీష్ రావు మరియు మండల బీజేపీ అధ్యక్షులు ఆకేటి శ్రీకృష్ణ, బీజేపీ కూటమి నాయకుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర మంత్రులు వాసంశెట్టి సుభాష్ విచ్చేసి ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ, యువత భవిష్యత్తే దేశ భవిష్యత్తు అని స్పష్టం చేశారు. యువత ఎలాంటి దుర్వ్యసనాలకు బానిస కాకుండా ఉత్తమ మార్గంలో పయనించాలని, 'వికసిత్ భారత్' సాధనలో యువత పాత్ర అత్యంత ప్రధానమైనదని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నాయకులు, ప్రధాన కార్యదర్శి పుల్లెల రామమూర్తి, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి, మండల సేవా సంకల్ప అభియాన్ కన్వీనర్ తోలేటి సూర్య గంగాధర్, అన్వర్, బీజేపీ మండల ఓబీసీ అధ్యక్షులు ఇంధన సత్యనారాయణ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.

సేవ సంకల్ప అభియాన్ భారతీయ చిన్నారుల కలలు అనే కార్యక్రమంలో

# చిత్రలేఖనంలో పాల్గొన్న విద్యార్థినులు



**కొత్తపేట, సెప్టెంబర్ 22, విశ్వం వాయిస్ న్యూస్ :** భారత దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ జన్మదిన వేడుకలలో భాగంగా సేవ సంకల్ప అభియాన్ 25 కోట్లు భారతీయ చిన్నారుల కలలు అనే కార్యక్రమంలో భాగంగా చిత్రాలేకనం పోటీలు స్థానిక బాలికల పాఠశాలలో జరిగాయి. సేవ సంకల్ప అభియాన్ మండల కన్వీనర్ పాలూరి జయ ప్రకాష్ నారాయణ (జేపీ) మాట్లాడుతూ ,విద్యార్థుల కు మెరుగైన విద్య అందించడమే లక్ష్యంగా నరేంద్ర మోడీ కృషి చేస్తున్నారు. విద్యార్థులను చదువు, క్రీడలు మెరుగుపరచడమే కాకుండా నూతన విద్యా విధానం తో విద్యార్థుల కు మెరుగైన ఫలితాలు తీసుకురావడం లో ఎన్డీఏ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని జేపీ అన్నారు. ఈ కార్యక్రమం లో నియోజకవర్గం ఇంచార్జి (సర్ )పాలూరి సత్యానందం మండల బీజేపీ అధ్యక్షులు సంపతి కనకేశ్వరరావు, సేవ సంకల్ప అభియాన్ కో కన్వీనర్ కోటిపల్లి దామోదర్, పేకెటి దివ్య, హెడ్ మాస్టర్ ఎన్ సత్యనారాయణ, కృష్ణ,తోగరు ఆంజనేయులు, అన్యం సత్యనారాయణ, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షులు రేలంగి ఆంజనేయులు, కిసాన్ మోర్చా మండల అధ్యక్షులు చోడపనీడి నాగబాబు, సిద్ధంశెట్టి శంకర్,పాలాటి ఆత్మ కమిటీ డైరెక్టర్ మాధవ స్వామి,కిరణ్ నాయుడు, ముకేశ్, అద్దంకి రాజేష్,ఉద్దరాజు ప్రసాద్ రాజు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రామచంద్రపురం ఏరియా ఆసుపత్రిలో యువకుడికి

# విజయవంతంగా అత్యవసర శస్త్రచికిత్స

## ప్రాణాలు కాపాడిన వైద్యులు

**రామచంద్రపురం, సెప్టెంబర్ 22, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం నివాసి, వి.ఎస్.ఎం. డిగ్రీ కళాశాలలో చివరి సంవత్సరం చదువుతున్న మణికంఠ స్వామి అనే యువకుడు తన అమ్మమ్మపై కోపంతో డైనింగ్ టేబుల్‌ను గట్టిగా గుద్దడంతో అతని కుడి చేతి నరాలన్నీ తెగిపోయాయి. ఈ ఘటనలో అతనికి తీవ్రంగా రక్తస్రావం జరిగి ప్రాణాపాయ స్థితికి చేరుకున్నాడు. వెంటనే కుటుంబ సభ్యులు అతనిని రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అత్యవసర పరిస్థితిని గమనించిన వైద్యుల బృందం వెంటనే స్పందించి అతనికి రక్తం ఎక్కించి, కుడి చేతి తెగిన నరాలను అతికేందుకు సుమారు మూడు గంటల పాటు శ్రమించి విజయవంతంగా శస్త్రచికిత్స పూర్తి చేశారు. ఈ క్లిష్టమైన ఆపరేషన్‌లో డాక్టర్ ఎస్. ప్రవీణ్, డాక్టర్ బి. కళ్యాణ్ బాబు, ఆపరేషన్ థియేటర్ స్టాఫ్ నర్సులు శ్రీమతి వి. రోజామణి, వరలక్ష్మి మరియు థియేటర్ సిబ్బంది తదితరులు పాల్గొని యువకుడి ప్రాణాలు కాపాడటంలో కీలక పాత్ర పోషించారు.

# దంగేరు ఉన్నత పాఠశాల విద్యార్థుల క్షేత్ర పర్యటన

## ఆర్టీసీ డిపో, నర్సరీ, రైస్ మిల్ సందర్శన



**దంగేరు, సెప్టెంబర్ 22, విశ్వం వాయిస్ న్యూస్ :** దంగేరు ఉన్నత పాఠశాల విద్యార్థులు వృత్తి విద్య శిక్షణ నిమిత్తం ఆర్టీసీ డిపోను, వ్యవసాయ శిక్షణ నిమిత్తం రామచంద్రపురం సమీపంలోని నర్సరీ క్షేత్రాన్ని సందర్శించారు. ఈ పర్యటనలో భాగంగా ఉపాధ్యాయులు 160 మంది విద్యార్థులను వేర్వేరు ప్రాంగణాలకు తీసుకొని వెళ్లారు. ఈ క్రమంలో విద్యార్థులు విజయశ్రీ ఆగ్రో ఫార్మ్స్‌ను సందర్శించారు. రోడ్డు రవాణా సాంకేతిక అంశాలను డిపో మేనేజర్ జి.ఎల్.ఎన్. మూర్తి మరియు సాంకేతిక నిపుణులు విద్యార్థులకు క్షుణ్ణంగా వివరించారు. అలాగే, శ్రీనివాసా బియ్యపు మిల్లును కూడా విద్యార్థులు సందర్శించి, అక్కడ యంత్రాల పనితీరును పరిశీలించారు. ఈ పర్యటనను ప్రధాన సమన్వయకర్త మమ్మీ పర్యవేక్షించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు గున్నం శ్రీనివాస్ మాట్లాడుతూ ఇటువంటి క్షేత్ర పర్యటనల వలన విద్యార్థులలో సృజనాత్మకత, వృత్తి విద్యా నైపుణ్యం మెరుగవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వృత్తి విద్య బోధకులు తేజ, వ్యవసాయ విద్య బోధకులు శేషు కుమార్, బి.వి.ఆర్.ఎస్.ఎస్. లక్ష్మీ, వాసా రాజశేఖర్, శారీరక శిక్షకులు మునాఫ్, చింతపల్లి గంగరాజు, బట్నవిల్లి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

# పిఠాపురం మోడల్ నియోజకవర్గంగా అభివృద్ధి : ఎంపీ తంగేళ్ల ఉదయ్ శ్రీనివాస్



**కాకినాడ, సెప్టెంబర్ 22, విశ్వం వాయిస్ న్యూస్ :** పిఠాపురాన్ని మోడల్ నియోజక వర్గంగా అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారని కాకినాడ పార్లమెంటు సభ్యుడు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ తెలిపారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ రెండు రోజుల పిఠా పురం పర్యటన నేపథ్యం లో రెండో రోజు మంగళ వారం జరిగిన బహిరంగ సభలో కాకినాడ పార్లమెంటు సభ్యుడు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ మాట్లాడుతూ పిఠాపురాన్ని మోడల్ నియోజకవర్గంగా అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చిత్తశుద్ధితో కృషి చేస్తున్నా రన్నారు. పిఠాపురం నియోజక వర్గంలో ప్రతి వర్గానికి అభివృద్ధి ఫలాలు అందేలా ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ అంకిత భావంతో కృషి చేస్తున్నారని తెలిపారు.సొంత కుటుంబం లో అన్నయ్య మాదిరిగా నియోజక వర్గానికి ప్రాతినిధ్యం వహిస్తూ, పిఠాపురాన్ని రాష్ట్రంలోనే ఒక ఆదర్శ నియోజక వర్గంగా తీర్చిదిద్దు తున్నారని కొనియాడారు. పిఠాపురం నియోజకవర్గంలో జల వనరుల శాఖ ఉన్నతాధికారులతో సమీక్షలు నిర్వహించి, సుమారు 53 వేల ఎకరాల కు సాగునీరు సమృద్ధిగా అందేలా పవన్ కళ్యాణ్ విశేష కృషి చేస్తున్నారని తెలిపారు.పిఠాపురం నడిబొడ్డున గతంలో డంపింగ్ యార్డుగా ఉన్న 5.60 ఎకరాల స్థలాన్ని, పర్యావరణ పరిరక్షణ, జీవవైవిధ్య సమతుల్య తను దృష్టిలో ఉంచుకుని ఆహ్లాదకరమైన ప్రాంతం గా మార్చడం జరిగిందని వివరించారు. పెద్ద పెద్ద నగరాల తరహాలో పిఠాపురం పట్టణంలో రూ. 230 కోట్ల అంచనా వ్యయం తో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ విధానానికి శ్రీకారం చుట్టడం విశేషమని పేర్కొన్నారు. ఉప్పాడ మండలానికి చెందిన 1,258 మత్స్యకార బోట్లలో సముద్రపు చేపల వేట సమయంలో భద్రత కొరకు ప్రత్యేక పరికరాలను అమర్చామని తెలిపారు. అలాగే, ఉప్పాడ తీర ప్రాంత రక్షణ గోడ నిర్మాణం కోసం రూ.323 కోట్లు కేటాయించడం జరిగిందనన్నారు. కేంద్ర ప్రభుత్వం జలజీవన్ మిషన్ పథకాన్ని నిలుపుదల చేసినప్పటికీ, పవన్ కళ్యాణ్ ప్రత్యేక చొరవ తీసుకొని ఆ పథకం కొనసాగింపు నకు కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించగ లిగారని ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ వెల్లడించారు. రాష్ట్రంలో చేపట్టిన మ్యాజిక్ డ్రైనేజీ వ్యవస్థ పనితీరుపై కేంద్ర పంచాయతీ రాజ్ మంత్రి సానుకూలంగా స్పందించి, ఈ విధానాన్ని దేశవ్యాప్తంగా అమలు చేసేందుకు చర్యలు తీసుకున్నారని తెలిపారు. మొత్తంగా,పిఠాపురం నియోజక వర్గ సర్వతో ము ఖాభివృద్ధికి ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్ ఎంతగానో శ్రమిస్తున్నారని ఎంపీ స్పష్టం చేశారు.

అంతరాష్ట్ర కరాటే పోటీల్లో

# రెండో స్థానంలో అమలాపురం భాష్యం స్కూల్



**అమలాపురం, సెప్టెంబర్ 22, విశ్వం వాయిస్ న్యూస్ :** యానాంలో గత ఆదివారం నిర్వహించిన మొదటి అంతరాష్ట్ర ఓపెన్ కరాటే, టైక్వాస్ట్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో అమలాపురం భాష్యం స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారు. వివిధ విభాగాల్లో పోటీ పడిన విద్యార్థులు ఆరు బంగారు పతకాలు, నాలుగు రజత పతకాలు, ఐదు కాంస్య పతకాలు సాధించారు. మొత్తం 15 పతకాలు సాధించి అంతరాష్ట్ర పోటీల్లో పాఠశాల రెండో స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా భాష్యం విద్యాసంస్థల అధినేత భాష్యం రామకృష్ణ, వైస్ చైర్మన్ భాష్యం హనుమంతరావు, మేనేజింగ్ డైరెక్టర్ భాష్యం సాకేత్ రామ్ విజేతలైన విద్యార్థులను అభినందించారు. అమలాపురం భాష్యం స్కూల్ జోనల్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ జవ్వాది వెంకట శ్రీనివాస్ విద్యార్థులను అభినందించారు. విద్యతో పాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాలని, క్రీడలు విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసం, పట్టుదలను పెంపొందిస్తాయని తెలిపారు. కరాటే పోటీల్లో పాల్గొన్న ప్రతి విద్యార్థి పతకం సాధించడం ఆనందంగా ఉందని జవ్వాది వెంకట శ్రీనివాస్ అన్నారు. విద్యార్థులకు సమర్థవంతమైన శిక్షణ అందించి ఈ విజయానికి కృషి చేసిన కరాటే కోచ్ దేశంశెట్టి సాయిబాబును ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులు వ్యక్తిగత ప్రతిభను చాటుకోవడంతో పాటు పాఠశాలకు కూడా మంచి గుర్తింపు తీసుకువచ్చారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాష్యం స్కూల్ అమలాపురం శాఖ ప్రిన్సిపాల్ సీహెచ్ రవి, ఛాంప్స్ ఇన్‌చార్జ్ కె.నాగశ్రీ, కె.రాజేశ్వరి, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ విజయానికి కృషి చేసిన కరాటే కోచ్ దేశంశెట్టి సాయిబాబుతో పాటు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులను ప్రత్యేకంగా అభినందించారు.



# అభివృద్ధి పథంలో పిఠాపురం నియోజకవర్గం

**89 మంది లబ్ధిదారులకు క్రమబద్ధీకరణ పట్టాలు అందజేసిన డిప్యూటీ సీఎం**

**మత్స్యకారులకు అధునాతన లైఫ్ జాకెట్లు డ్రై ఫిష్ యూనిట్లు**









**కాకినాడ, సెప్టెంబర్ 22, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ పిఠాపురం నియోజకవర్గంలో రెండో రోజు పర్యటనలో భాగంగా పిఠాపురం నియోజక వర్గాన్ని దేశంలోనే మోడల్ నియోజక వర్గంగా తీర్చిదిద్దుతానని ఇచ్చిన మాట మేరకు ప్రతి అడుగు అభివృద్ధి వైపు వేస్తున్నారు. రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్ బహిరంగ సభలో ప్రసంగించక ముందు ఆయన బహిరంగ సభకు సమీపంలో ఏర్పాటు చేసిన డ్వాక్రా మహిళలు చేసిన వివిధ స్టాళ్లను క్షుణ్ణంగా పరిశీలించారు. పిఠాపురం ఆర్ఆర్బీ హెచ్ఆర్ కళాశాల సభా ప్రాంగణం వద్ద ఏర్పాటు చేసిన స్టాల్స్ సందర్శన లో భాగంగా కాకినాడ జిల్లా గ్రామీణ మహిళలకు గుర్తింపు దెక్కతో అలంకరణ వస్తువులు తయారు చేసిన ఉత్పత్తులను ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్ని ప్రత్యేకంగా ఆకర్షించాయి. బహిరంగ సభ లో రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ చేతులు మీదు గా 89 మంది లబ్ధి దారులకు క్రమబద్ధీకరణ పట్టాలు అందజేసి వారి భూ హక్కులకు భరోసా కల్పిస్తూ పట్టాల పంపిణీ చేశారు. ఉప్పాడ తీర ప్రాంత మత్స్యకారుల జీవితాల్లో భద్రతతో కూడిన భరోసా నింపుతూ అధునాతన లైఫ్ జాకెట్లు, డ్రై ఫిష్ యూనిట్లు, ఐస్ బాక్సులతో కూడిన మోటార్ సైకిళ్లను పంపిణీ చేశారు. జిల్లా మత్స్య శాఖ ఆధ్వర్యంలో మత్స్యకారులకు సముద్ర వేటలో సురక్షితంగా ఉండేందుకు ఉపయోగ పడే (సీ సేఫ్టీ) యంత్ర పరికరాలు, యంత్ర పరికరాలు, పచ్చి చేపలు అమ్మకంలో ఉపయోగ పడే ఐస్ బాక్స్ లు, ద్విచక్ర వాహనాల, ఎండు చేపలు అమ్ముకో నేందుకు ఆటోలు, టార్పాలిన్, కట్టర్లు పంపిణీ చేశారు. మత్స్యకారులకు పంపిణీ చేయనున్న యంత్ర పరికరాలు పనిముట్లు, వాహనాలకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.

**హోండా యాక్టివా ద్విచక్ర వాహనాలు**

ఒక ఐస్ బాక్స్ (100 లీటర్లు), ఐస్ బాక్స్ మోయడానికి ఇనుప ఫ్రేమ్‌తో కూడిన 30 హోండా యాక్టివా వాహనాలు 36.00 లక్షల రూపాయల వ్యయంతో పంపిణీ.

**చేపలు ఎండబెట్టే వ్యాపారస్తుల పరికరాలు**

50 కేజీల సామర్థ్యం గల 2 సిమెంట్ లిడ్స్ (ఉప్పులో చేపలు నానబెట్టడానికి), 2 టార్పాలిన్ షీట్లు (20ఇ20) కలిగిన 76 యూనిట్లు 15.20 లక్షల రూపాయల వ్యయంతో టార్పాలిన్ పంపిణీ.

**తాజా చేపల విక్రయదారులు**

25 కేజీల సామర్థ్యం గల 1 అల్యూమినియం బేసిన్, 1 ఫిష్ కట్టర్, 1 స్టీల్ ప్లేట్, మూత, 100 లీటర్ల సీ ప్లాస్ట్ ఐస్ బాక్స్‌తో కూడిన 37 ఆటోలు 7.40 లక్షల రూపాయల వ్యయంతో ప్లాస్ట్ ఐస్ బాక్స్‌తోపంపిణీ చేసారు.

**సముద్ర భద్రతా పరికరాలు**

2 లైఫ్ బాయ్స్, 4 లైఫ్ జాకెట్లు, 1 ఫైర్ ఎంటిగ్యుషైర్, 1 ఐస్ బాక్స్ (100 లీటర్లు) కలిగిన మొత్తం 1258 భద్రతా పరికరాలు 200 లక్షల (2 కోట్ల) రూపాయల వ్యయంతో పంపిణీ. మొత్తంగా 1401 లబ్ధిదారులకు రూ.258.6 లక్షల రూపాయల వ్యయంతో యంత్ర పరికరాలు, పనిముట్లు వాహనాను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. పిఠాపురం నియోజక వర్గంలో గత 2025-26 సంవత్సరం పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన 34 మంది విద్యార్థులకు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ల్యాప్టాప్ లను అందజేశారు. మహిళల ఆర్థిక స్వావలంబనకు ఊతమిచ్చేలా 475 స్వయం సహాయక సంఘాలకు రూ.75 కోట్ల 80 రుణాలు మహిళలకు పంపిణీ చేశారు.మెప్మా ద్వారా 251 లబ్ధి దారులకు రూ.43 కోట్ల 23 లక్షలు మెగా చెక్కుఅందచేశారు. ఒక కుటుంబం ఒక పారిశ్రామిక వేత్త కార్య క్రమము లో భాగంగా 1399 మందికి రూ.23 కోట్ల మెగా చెక్కు పంపిణీ చేశారు. ఎల్ ని నో ప్రభావంతో రైతులకు అండగా నిలిచిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కి రైతులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లోక్ సభ పార్లమెంటు సభ్యుడు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, జిల్లా ఎస్.పి బిందు మాధవ్, కాకినాడ రూరల్,రాజా నగరం శాసన సభ్యుడు పంతం నానాజీ,ఒత్తుల బల రామకృష్ణ,కౌడా చైర్మన్ తలాటం సత్య, డిసిసిబి చైర్మన్ తుమ్మల రామ స్వామి,రాష్ట్ర సివిల్ సప్లైస్ కార్పొరేషన్ చైర్మన్ తోట సుధీర్,ట్రైనీ కలెక్టర్ ప్రియా,పాడా పిడి శివ రామ్ ప్రసాద్, సంబంధిత అధికారులు,పెద్ద ఎత్తున ప్రజలు,అభిమానులు పాల్గొన్నారు.

నేడు రేపు భారీ వర్షాలు

# ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



**ఎమ్మెల్యే యనమల దివ్య**

**కోటనందూరు, సెప్టెంబర్ 22, విశ్వం వాయిస్ న్యూస్ :** నేడు రేపు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ విఫ్ యనమల దివ్య కోరారు.గతవారం రోజులుగా కురుస్తున్న వర్షాలు వ్యవసాయ రంగానికి లాభంసాటి అవుతాయని ఆమె ఆశాభావం వ్యక్తంచేశారు.అయితే బంగాళా ఖాతంలో ఏర్పడ్డ వాయుగుండం ప్రభావంతో మన ప్రాంతంలో కుండపోత వర్షాలు కురిసి అవకాశం ఉందని అందుచేత ప్రజలు అధికారులు ఇచ్చే సూచనలు పాటించాలని కోరారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఇప్పుడిప్పుడే చెరువు గర్భాలకు వర్షం చేరుకుంటుందని రానున్న రెండు మూడు రోజుల్లో చెరువుల్లో జలకళ కనిపిస్తుందని ఎమ్మెల్యే యనమల దివ్య ఆశాభావం వ్యక్తం చేశారు. ఎడతెరిపివ్వని వర్షాల వల్ల తుని పట్టణంలో శానిటేషన్ మెరుగుదలకు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ యంత్రాంగాన్ని ఆదేశించడం జరిగిందని మురుగునీటిపారుదల సక్రమంగా జరిగేందుకు కాల్వల్లో ఎప్పటికప్పుడు పూడికతీత చేపట్టాలని ఆదేశించామని తెలిపారు. పట్టణంలో ఎక్కడా ముంపు లేకుండా పకడ్బందీ చర్యలు తీసుకున్నామని అన్నారు.

## విశ్రాంత ఉపాధ్యాయుడు దాలినాయుడికి అరుదైన అవకాశం



**కోటనందూరు, సెప్టెంబర్ 22, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా కోటనందూరు మండలం కేఈ చిన్నయ్యపాలెం గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు పోలుపర్తి దాలినాయుడికి అరుదైనా అవకాశం లభించింది. హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌లో ఉన్న నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్మెంట్ & ప్రజా సంబంధాల సంస్థలో బుధవారం ఆయన ప్రసంగించబోతున్నారు. ఈ కార్యక్రమం అనంతరం మల్లారెడ్డి గ్రూపు ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ లో జరిగే కార్యక్రమాల్లో దాలినాయుడు ప్రసంగిస్తారు. ప్రశాంగించడంతో బాటు విద్యార్థులకు తగు శిక్షణ, సలహా సూచనలు ఇవ్వబోతున్నారు. దేశంలోని విద్యార్థులే కాక విదేశీ విద్యార్థులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారు.. పర్యావరణ పరిరక్షణ కోసం దాలినాయుడు హరితస ఫౌండేషన్ నెలకొల్పి నదీ గట్లు కోత నివారణకు వెదురు, తాటి చెట్లను నాటడం, పిచ్చుకల పరిరక్షణ కోసం ప్రతీ గ్రామంలో వరి కుచ్చులు వేలాడదీయంచడం వంటి కార్యక్రమాలను గత కొన్నేళ్ళుగా చేస్తూ వస్తున్నారు. ఎవరి ఆర్థిక సహాయాన్ని ఆర్థించకుండా చేస్తున్న ఈ కార్యక్రమాల గురించి మనందరికీ తెలిసినదే. ఈయన ఆశయాలు ఆలోచనలు కొనసాగాలని అందరూ మనస్ఫూర్తిగా అభినందిస్తున్నారు.

## పారిశుద్ధ్య కార్మికులకు రైన్ కోట్లు పంపిణీ



**కోటనందూరు, సెప్టెంబర్ 22, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా కోటనందూరు పంచాయితీ పరిధిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు స్థానిక శ్రీ అల్లూరి సీతారామరాజు సేవా కమిటీ రైన్ కోట్లను పంపిణీ చేసింది. తీవ్రంగా వర్షం పడుతున్న కారణంగా పంచాయతీ పరిధిలోని తొమ్మిది మంది పారిశుధ్య కార్మికులకు మంగళవారం అందజేశామని ఆ కమిటీ అధ్యక్షుడు లక్కాకుల బాబ్జి తెలియజేసారు. ఈ సహాయం యొక్క విలువ తక్కువే అయినా వర్షం వల్ల వీటి అవసరం విలువ ఎక్కువ అని, గతంలో కూడా ఈ కమిటీ వారు దుస్తులు, దుప్పట్లు, లుంగీలు, తువ్వాళ్ళు పారిశుధ్య కార్మికులకు అందజేశారని, పారిశుధ్య కార్మికుల అవసరాన్ని గుర్తించి వారి అవసరాలకు సాయపడుతున్నందుకు శ్రీ అల్లూరి సీతారామరాజు సేవా కమిటీ కి గ్రామ పంచాయతీ కార్యదర్శి సాంబశివరావు కృతజ్ఞతలు తెలియజేసారు.

## కాకినాడ నగర అభివృద్ధికి రూ.93 కోట్లు

**పట్టణ మౌలిక వసతులకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట : ఎమ్మెల్యే వనమాడి కొండబాబు**



**కాకినాడ, సెప్టెంబర్ 22, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు (కొండబాబు) అన్నారు.హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ ద్వారా కాకినాడ నగరానికి రూ.93 కోట్ల నిధులు మంజూరు చేసి రహదారులు, డ్రైనేజీలు, వీధి దీపాలు, పార్కులు, సెంటర్ డివైడర్లు తదితర మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. కుప్పం నుంచి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర వ్యాప్తంగా పట్టణాభివృద్ధి పనులను ప్రారంభించగా, కాకినాడ ఎటిమొగ ప్రాంతం నందు కాకినాడ నగరంలో చేపట్టు 93 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ముఖ్యమంత్రి ప్రసంగాన్ని ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా ప్రజాప్రతినిధులు కొండబాబు, ఎమ్మెల్సీలు పేరాబత్తుల రాజశేఖర్, కర్రీ పద్మశ్రీ, కాకినాడ రూరల్ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణ మూర్తి, అధికారులు, ప్రజలు వీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొండబాబు మాట్లాడుతూ రాష్ట్రంలోని 120 కుపైగా మున్సిపాలిటీలు, పట్టణ స్థానిక సంస్థల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం భారీగా నిధులు కేటాయించిందని, కాకినాడలో ఎన్నో ఏళ్లుగా రహదారులు, డ్రైనేజీలు లేని ప్రాంతాల్లో అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి వ్యర్థాల నిర్వహణకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని, వ్యర్థాల నుంచి విద్యుత్ ఉత్పత్తి చేసే వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ ఏర్పాటు దిశగా చర్యలు కొనసాగుతున్నాయని, ప్లాంట్ అందుబాటులోకి వచ్చిన తర్వాత ప్రతిరోజూ సేకరించే చెత్తను అక్కడికి తరలించి విద్యుత్ ఉత్పత్తి చేయడంతో పాటు ఆదాయాన్ని సమకూర్చుకునే అవకాశం ఉంటుందని వివరించారు. చెత్తను సమస్యగా కాకుండా సంపదగా మార్చాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆలోచనకు అనుగుణంగా చర్యలు చేపడు తున్నామని, డ్రైనేజీలు, రహదారులు, తాగునీరు, వీధి దీపాలు తదితర మౌలిక వసతుల పనులను ప్రాధాన్యత క్రమంలో చేపడుతున్నామని, కాకినాడ నగర అభివృద్ధికి రూ.93 కోట్ల నిధులు కేటాయించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు నగర ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో కాకినాడను అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే కొండబాబు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ, డిప్యూటీ కమిషనర్ కె. శ్రీనివాస్, ఎస్ఈ పి. వెంకట్రావు, ఈఈలు కనకారావు, మాచరాజు, టీపీఆర్ఓ సతీష్, మల్లిపూడి వీరు, చైర్మన్ బచ్చు శేఖర్, గదుల సాయిబాబా, ఏ వి డి మెంటారావు, అరదాడి శివ, అంగాడి దుర్గారావు, కోనాడ ప్రకాష్, చింతా సతీష్, పినపోతు రాము, పినపోతు జీవారత్నం, ఓలేటి పాండురంగడు, పట్టా ధనలక్ష్మి, ఆదం సతీష్, పాలిపు రాజు, బలసాడి శ్రీను, కామాడి సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

తుఫాను సన్నాహక చర్యలపై

## శాఖల వారీగా సమీక్షా సమావేశం

**ప్రజా భద్రతే ధ్యేయంగా అధికారులు క్షేత్రస్థాయిలో పనిచేయాలని**

**జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ ఆదేశం**



**కాకినాడ, సెప్టెంబర్ 22, విశ్వం వాయిస్ న్యూస్ :** రానున్న మూడు రోజులు జిల్లాలో భారీ వర్షాలు తుఫాను ముప్పు నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అత్యంత అప్రమత్తంగా ఉండాలని వర్షాల వల్ల ఎలాంటి ప్రాణ నష్టం పశునష్టం జరగ కుండా తగిన చర్యలు చేపట్టాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం నుండి వివిధ శాఖల అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా తుఫాను సన్నాహక సమీక్షా సమా వేశం లో జిల్లా కలెక్టర్ అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో మూడు రోజుల పాటు భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నందున జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని క్షేత్రస్థాయిలో ఉండే అధికారులు, మండల జిల్లా స్థాయి అధికారులు వారి వారి ప్రధాన కార్య స్థానాలలో అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ముంపు ముప్పు ఉన్న ప్రాంతాల్లో ఇసుక కొరత లేకుండా చూడాలని, అవసరమైన చోట్లకు ఇసుకను తరలించడానికి ముందస్తుగా నిల్వ పాయింట్లను, ఇసుక సంచులను సిద్ధం చేయాలని ఆదేశించారు. గండిపడే అవకాశం ఉన్న కాలవ గట్లు, చెరువు గట్లను ముందే గుర్తించి బలోపేతం చేయాలని,ఎమ్ఐ ట్యాంకుల వద్ద అవసరమైన మెటీరియల్ అందుబాటు లో ఉంచుకోవాలని స్పష్టం చేశారు.లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు చర్యలు చేపట్టాలని, వర్షపాతం ఎక్కువగా నమోదు అయ్యే అవకాశం ఉన్నందున నదులు, చెరువులు, వాగుల వద్ద నీటిమట్టం పెరిగే అవకాశం ఉంటుందని ఇరిగేషన్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. చెరువులు, వాగులు, వంకల వద్ద నిరంతరం గస్తి నిర్వహించాలని, నీటి ప్రవాహం ఎక్కువగా ఉండే చోట ప్రజలు,పిల్లలు వెళ్లకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.విద్యుత్ సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండా ఈపీడీసీఎల్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. వాలిపోయిన విద్యుత్ స్తంభాలు, కరెంట్ తీగలను పరిశీలించి, చెట్ల కొమ్మలను తొలగించాలని సూచించారు. సబ్‌స్టేషన్లలో నిలిచిన నీటిని తొలగించి, ఆస్పత్రులు అత్యవసర సేవలకు అంతరాయం కలగకుండా జనరేటర్లు, డీజిల్, విద్యుత్ స్తంభాలు, గ్యాంగ్ సిబ్బందిని సిద్ధంగా ఉంచాలన్నారు. మత్స్యకారులను వేటకు వెళ్లకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నామని ఫిషరీస్ అధికారులు తెలిపారు.ఆక్వా రైతులకు పవర్ కట్ అయితే జనరేటర్లు డీజిల్ సిద్ధం చేసుకోవాలని సూచించామని అవసరమైన స్విమ్మర్లు, పడవలను సిద్ధంగా ఉంచామని వివరించారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులురైతులను చైతన్యపరచాలని, కోతకు వచ్చిన అరటి, బొప్పాయి, కూరగాయల పంటలను వెంటనే హార్వెస్ట్ చేసుకోవాలని సూచించారు.వర్షపాతం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ పంటలకు ఉచితంగా విత్తనాల పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నట్లు అగ్రికల్చర్ అధికారులు తెలిపారు. ఆర్టీసీ అధికారులు ఎమర్జెన్సీ బస్సులను సిద్ధం చేయాలని డిజాస్టర్ రెస్పాన్స్ కోసం ఫైర్ డిపార్ట్మెంట్ ఎస్‌డీఆర్ఎఫ్, ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచాలని వెల్లడించారు.అధికారులు నిరంతరం మండలాల్లో పర్యటిస్తూ క్షేత్రస్థాయి పరిస్థితిని పర్యవేక్షించాలని, ప్రజా భద్రతే ధ్యేయంగా నాయకత్వ పటిమ చూపాలని కలెక్టర్ ఆదేశించారు. మూడు రోజులపాటు జిల్లా యంత్రాంగం పూర్తి అప్రమత్తంగా ఉంటుందని అధికారులందరూ సమన్వయంతో పని చేయడం ద్వారా ఈ విపత్తు నుండి బయటపడగలమని జిల్లా కలెక్టర్ ఆదేశించారు

తుఫాను హెచ్చరికల నేపథ్యంలో

## అధికారులు అప్రమత్తం

**గ్రామ కార్యదర్శులతో ఎంపీడీవో సమావేశం**

**తాగునీరు, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి ఎంపీడీవో ఆదేశాలు**



**కోటనందూరు, సెప్టెంబర్ 22, విశ్వం వాయిస్ న్యూస్ :** బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం తీవ్రస్థాయికి చేరుకునే అవకాశం ఉందన్న ముందస్తు హెచ్చరికల నేపథ్యంలో కోటనందూరు మండల అధికారులు అప్రమత్తమయ్యారు. మండలంలోని అన్ని గ్రామ కార్యదర్శులతో ఎంపీడీవో పి వెంకటనారాయణ ప్రత్యేక సమావేశం నిర్వహించి తుఫాను ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై సూచనలు చేశారు. తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో అధిక నష్టం జరిగే అవకాశం ఉన్నందున గ్రామాల్లో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని ఎంపీడీవో సూచించారు. ముఖ్యంగా మంచినీటి సరఫరాకు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని, అవసరమైన చోట ప్రత్యామ్నాయ ఏర్పాట్లు సిద్ధంగా ఉంచాలని తెలిపారు. అలాగే గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ సక్రమంగా ఉండేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని, పారిశుధ్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని సూచించారు. తుఫాను సమయంలో అత్యవసర పరిస్థితులు తలెత్తినప్పుడు ఇబ్బందులు లేకుండా అవసరమైన పారిశుధ్య సామగ్రిని ముందుగానే తగినంతగా నిల్వ ఉంచుకోవాలని గ్రామ కార్యదర్శులకు సూచించారు. ప్రజలకు తాగునీరు, పారిశుధ్యం తదితర ప్రాథమిక సౌకర్యాల్లో ఎలాంటి అంతరాయం కలగకుండా సంబంధిత సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని అధికారులు ఆదేశించారు. తుఫాను ప్రభావం పూర్తిగా తగ్గే వరకు గ్రామస్థాయిలో పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు.





# రైతుకు.. రైతే శత్రువా..?

## బోరు విషయంలో రైతుల మధ్య విభేదాలు..

### అధికారుల అనుమతులున్నా అడ్డంకుల ఆరోపణలు.



- నీరు లేక బీటలు వారుతున్న పంట పొలాలు
- నిబంధనలు అందరికి ఒకేలా ఉండాలి
- అనుమతులు లేకుండా బోర్లు నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు
- అధికారులు జోక్యంపై ఆశలు

ఉంగరాల మణిరత్నం.

**గోకవరం, సెప్టెంబర్ 22, విశ్వం వాయిస్ న్యూస్ :** పంటలకు సాగునీరు అందక పొలాలు ఎండిపోతున్న వేళ.. భూగర్భ జలాలపై ఆధారపడి పంటలను కాపాడుకునేందుకు రైతులు పడుతున్న కష్టాలకు తోడు, రైతులమధ్యనెలకొంటున్న విభేదాలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయి. గోకవరం మండలం రంప ఎర్రంపాలెం గ్రామంలో బోరు ఏర్పాటు విషయంలో చోటుచేసుకున్న వివాదంప్రస్తుతంచర్చనీయాంశంగా మారింది. తమ సొంత పొలంలో బోరు వేసుకునేందుకు సంబంధిత అధికారులను సంప్రదించి, వారి పర్యవేక్షణలో అవసరమైన అనుమతులు పొందినప్పటికీ కొంతమందిరైతులుకక్షపూరితంగా అడ్డుకుంటున్నారని బాధిత రైతు ఆరోపిస్తున్నారు. పంటలకు నీటి అవసరం అత్యవసరంగా ఉన్న సమయంలోబోరువేసుకునే ప్రయత్నాన్ని అడ్డుకోవడం వల్ల తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**అధికారుల జోక్యంపై ఆశలు**

రైతుల మధ్య వివాదం మరింత ముదరకముందే సంబంధిత అధికారులు స్పందించి, బోరు ఏర్పాటు విషయంలో ఉన్న అనుమతులు, విద్యుత్ కనెక్షన్లు, నిబంధనల అమలుపై సమగ్రంగా పరిశీలించాలని గ్రామ రైతులు కోరుతున్నారు. సాగునీటి కోసం రైతు మరో రైతుతో పోరాడాల్సిన పరిస్థితి రాకుండా.. నిబంధనల ప్రకారం సమస్యను పరిష్కరించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. పంటలను కాపాడుకోవడం కోసం రైతులు ఎదుర్కొంటున్న ఈ సమస్యపై అధికారులు తక్షణమే స్పందించి న్యాయం చేయాలని రంప ఎర్రంపాలెం రైతులు కోరుతున్నారు.



ఎండిపోతున్న పంట పొలాలు

**నీరు లేక బీటలు వారుతున్న పంట పొలాలు**

వర్షాలు ఆశించిన స్థాయిలో లేకపోవడంతో ఇప్పటికే పంట పొలాలు నీరు లేక ఎండిపోతున్నాయని రైతులు చెబుతున్నారు. పొలాల్లో భూమి బీటలు వారంతో పెట్టుబడులు పెట్టిన రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో బోరు ద్వారా సాగునీరు అందించి పంటలను కాపాడుకోవాలనుకుంటున్న రైతులకు ఇతరుల నుంచి అడ్డంకులు ఎదురవడం సమస్యను మరింత తీవ్రతరం చేస్తోందని స్థానిక రైతులు అంటున్నారు.

**నిబంధనలు అందరికీ ఒకేలా ఉండాలి**

ఒకవైపు అనుమతులు తీసుకుని బోరు ఏర్పాటుచేసుకునే రైతులను అడ్డుకుంటున్నారని ఆరోపణలు వస్తుండగా, మరోవైపు ఒకే విద్యుత్ కనెక్షన్‌పై అవసరమైన అనుమతులు లేకుండా మూడు బోర్లను నడుపుతున్నారని కొంతమంది రైతులు ఆరోపిస్తున్నారు. ఈ అంశంపై సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని వారు కోరుతున్నారు.

సీతానగరం మండలంలో

# 'పొలం పిలుస్తోంది'




**సీతానగరం, సెప్టెంబర్ 22, విశ్వం వాయిస్ న్యూస్ :** సీతానగరం మండలం ముగ్గుళ్ళ, ఇనుగంటివారిపేట గ్రామాలలో పొలం పిలుస్తుంది అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమములో సహాయ వ్యవసాయ సంచాలకులు దేవరకొండ శ్రీనివాసరావు పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు. రైతులకు అవసరమైన ఎరువుల సరఫరాను అందుబాటులోనికి తీసుకు రావడం జరిగిందని అన్నారు. రైతులందరూ విశిష్ట గుర్తింపు పొందాలని, ఈ పంట నమోదు చేసుకున్న రైతులందరూ తమ వివరాలను సెప్టెంబరు 30వ తారీకు లోగా పూర్తి చేయాలని అన్నారు. అలాగే పొగాకు, నారుమళ్లను పరిశీలించి మాగుడు తెగులు నివారణకు పిచికారి చేయాలని, సేంద్రీయ ఎరువులతో కలిపి వినియోగించడం ద్వారా ప్రధాన పొలంలో వ్యాధులను నివారించవచ్చునని రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు విజయరావు, అఖిలాండేశ్వరి మరియు తలారి స్వాతి తదితరులు పాల్గొన్నారు.

లడ్డూ ప్రసాదంపై దుష్ప్రచారానికి

# చంద్రబాబు, పవన్ క్షమాపణ చెప్పాలి

### జక్కంపూడి డిమాండ్ - ఈడీ దర్యాప్తులో జంతుకొవ్వు లేదని వెల్లడి - వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



**కోరుకొండ, సెప్టెంబర్ 22, విశ్వం వాయిస్ న్యూస్ :** తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంలో జంతు కొవ్వు కలిసిందంటూ ఆరోపణలు అసత్యప్రచారం చేసిన సీఎం చంద్రబాబు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ భక్తులకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని వైఎస్సార్‌సీపీ అమలాపురం పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకురాలు జక్కంపూడి విజయలక్ష్మి డిమాండ్ చేశారు. సోమవారం రాజానగరం మండలం రావులచెరువు గట్టుపై ఉన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో విజయలక్ష్మి ఆధ్వర్యంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. స్వామివారి ఆలయ మెట్లను శుభ్రం చేసి, పసుపురాసి పూజ లు చేశారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ శ్రీవారి లడ్డూ ప్రసాదంలో జంతుకొవ్వు కలిసిందంటూ 2024లో తీవ్ర ఆరోపణలు వచ్చాయని, ఆ తర్వాత సుప్రీంకోర్టు పర్యవేక్షణలో సీబీఐ ఆధ్వర్యంలోని ప్రత్యేక దర్యాప్తు బృందం విచారణ చేపట్టిందని విజయలక్ష్మి తెలిపారు. 2026లో వెలువడిన సీబీఐ చార్జ్‌షీట్ పై వచ్చిన వివరాల ప్రకారం లడ్డూ తయారీకి ఉపయోగించిన నెయ్యి లో బీఫ్ టాలో, లార్డ్ ఉన్నట్లు ఆధారాలు లభించలేదని పేర్కొన్నారని అన్నారు. అదే సమయంలో నెయ్యి కల్తీకి సంబంధించి వెజిటబుల్ ఆయిల్స్, కెమికల్ ఎస్టర్లవిని యోగంపై దర్యాప్తులో వివరాలు వెల్లడయ్యాయన్నారు. చంద్రబాబు నాయుడు రాజకీయ ప్రయోజనాల కోసం స్వామివారి లడ్డూ ప్రసాదాన్ని వివాదంలోకి తీసుకొచ్చారని, సనాతన హిందువునని చెప్పుకునే పవన్ కళ్యాణ్ ఈ వ్యవహారంపై ఇప్పుడు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. కోట్లాది మంది హిందువులు, శ్రీవారి భక్తుల మనోభావాలకు సంబంధించిన అంశాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించడం సరికాదని, ఇప్పటికైనా తమ వ్యాఖ్యలపై వివరణ ఇచ్చి, భక్తులకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వేమగిరి కృష్ణ, గంగిశెట్టి సోమేశ్వరరావు, దూలం పెద్ద, కూటి ప్రసాద్, వల్లభశెట్టి సత్యనారాయణ, సంగీత శ్రీనివాస్, బత్తుల వెంకట్రావు, మరుకుర్తి వెంకటేశ్వరరావు, ప్రగడ చక్రి, పేపకాయల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# పెనకటి దంపతుల ఆధ్వర్యంలో ఘనంగా గణపతి హోమం



**కోరుకొండ, సెప్టెంబర్ 22, విశ్వం వాయిస్ న్యూస్ :** తమ సరస్వతి విద్యానికేతన్ విద్యార్థిని విద్యార్థులకు విద్యా గణపతి సర్వవిఘ్నాలు తొలగించి ఉన్నత విద్యను అందించాలని కోరుకొండ సరస్వతి విద్యానికేతన్ అధినేత పెనకటి గంగాధర్ పుష్పాంజలి దంపతులు తెలిపారు. సోమవారం కోరుకొండ సరస్వతి విద్యానికేతన్ లో పెనకటి గంగాధర్ దంపతుల ఆధ్వర్యంలో గణపతి నవరాత్రుల మహోత్సవంలో భాగంగా 8వరోజు గణపతి హోమాన్ని వేద పండితుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెనకటి దంపతులు మాట్లాడుతూ తమ సరస్వతి విద్యానికేతన్ లో విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి, ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. అదేవిధంగా ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలని, రైతులకు తాము చేస్తున్న వ్యవసాయం సమృద్ధిగా కలిసి రావాలన్నారు. అనంతరం విద్యా గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించి, బంధుమిత్రులతో సహపంక్తి భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, పలువురు ఎన్డీఏ నాయకులు, విద్యార్థిని విద్యార్థులు, ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక సీఎం డీ.కె.శివ కుమార్‌ను

# మర్యాద పూర్వకముగా కలిసిన పెందుర్తి అభిరామ్



**సీతానగరం, సెప్టెంబర్ 22, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా రాజానగరం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు రాజానగరం మాజీ శాసనసభ్యులు మరియు సీఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్ (క్యాబినెట్ మినిస్టర్ హోదా)పెందుర్తి వెంకటేష్ తనయుడు రాజానగరం నియోజక వర్గం తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు పెందుర్తి అభిరామ్ బెంగుళూరులో కర్ణాటక సి ఎం శివకుమార్ ను మర్యాదపూర్వకముగా వారి నివాసము నందు కలవడం జరిగింది. ఈ సందర్భముగా పెందుర్తి అభిరామ్ సీఎం డీకే శివకుమార్ కు కలియుగ దైవం వెంకటేశ్వర స్వామి ప్రతిమను ఇచ్చి శుభాకాం క్షలు తెలియజేశారు. అనంతరం ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల రాజకీయ పరిస్థితులు, యువజన విభాగాలు, మరియు ప్రాంతీయ అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించడం జరిగింది. దక్షిణాది రాజకీయాలలో మంచి సమర్థవంతమైన నాయకుడుగా సీఎం డీకే శివకుమార్ మంచి పేరు సంపాదించారని అభిరామ్ అన్నారు. రాష్ట్రంలో జరుగుతున్నటువంటి పరిణామాలపై అనేక సమస్యలపై వీరిద్దరూ చర్చించడం జరిగింది. ఈ సందర్భముగా అభిరామ్ మాట్లాడుతూ డీకే శివకుమార్ ని కలవడం నాకు ఎంతో సంతోషాన్ని, ఆనందాన్ని ఇచ్చిందని అన్నారు.

# షట్టర్ తాళాలు పగలగొట్టి దొంగతనాలు.. నలుగురు అదుపులో

### 7 ద్విచక్ర వాహనాలు, బట్టలు, సిగరెట్లు స్వాధీనం : మరో నిందితుడి కోసం గాలింపు

**గోకవరం, సెప్టెంబర్ 22, విశ్వం వాయిస్ న్యూస్ :** సెప్టెంబర్ 23 విశ్వం వాయిస్ న్యూస్ షట్టర్ తాళాలు పగలగొట్టి వరుస దొంగతనాలకు పాల్పడుతున్న ముఠా గుట్టును గోకవరం పోలీసులు ఛేదించారు. ఈ కేసులో నలుగురిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి 7 ద్విచక్ర వాహనాలు, దొంగిలించిన బట్టలు, సిగరెట్లు స్వాధీనం చేసుకున్నట్లు కోరుకొండ సీఐ ఎస్.వి.వి.ఎస్. మూర్తి తెలిపారు. గోకవరం మండలం వీరలంకపల్లి జంక్షన్‌లో సెప్టెంబర్ 5న అర్ధరాత్రి ఓ షెడ్ తాళాలు పగలగొట్టి, అక్కడి సీసీ కెమెరాను ధ్వంసం చేసి బట్టలు, కళ్లజోళ్లు అపహరించిన ఘటనపై ఎస్సై పవన్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా మంగళవారం ఉదయం గోకవరం ఠాణా సెంటర్ వద్ద అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారించగా పలు దొంగతనాల వ్యవహారం వెలుగులోకి వచ్చినట్లు పోలీసులు తెలిపారు. అదుపులోకి తీసుకున్న వారిలో లికీలు శివ (19), కామకుల వినయ్ అలియాస్ గుండు (20)లతో పాటు మరో ఇద్దరు మైనర్లు ఉన్నట్లు సీఐ తెలిపారు. మరో నిందితుడు కుంజం అభి పరారీలో ఉన్నాడని, అతని కోసం గాలింపు కొనసాగుతోందన్నారు. నిందితుల నుంచి నేరాలకు ఉపయోగించిన Yamaha R15, Suzuki Access 125 వాహనాలతో పాటు దొంగిలించిన వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. అలాగే విచారణలో సెప్టెంబర్ 18న వీరలంకపల్లి జంక్షన్ సమీపంలోని టీ షాప్ తాళాలు పగలగొట్టి సుమారు రూ.5 వేల నగదు, సిగరెట్లు దొంగిలించిన కేసు కూడా బయటపడినట్లు వెల్లడించారు.

**7 బైక్‌ల చోరీలు వెలుగులోకి**

విచారణలో గత ఆగస్టు నుంచి కొంతమూరు-నల్లజర్ల హైవే పరిధిలో సుమారు 7 ద్విచక్ర వాహనాలను దొంగిలించినట్లు గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. వాటిలో



Suzuki Access 125, KTM Duke, HF Deluxe, Honda Activa, మరో Suzuki Access 125, KTM Duke, Yamaha FZ వాహనాలు ఉన్నాయని, మొత్తం వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

**గతంలోనూ కేసులు**

అదుపులోకి తీసుకున్న వారిలో కొందరిపై గతంలోనూ కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. అడ్డతీగల ఆది శివ శంకర్ అలియాస్ లిల్లీపై రంపచోడవరం పోలీస్ స్టేషన్‌లో గంజాయి కేసు, కీలు శివపై రాజానగరం పోలీస్ స్టేషన్‌లో బైక్ దొంగతనం కేసు నమోదై ఉన్నట్లు సీఐ వెల్లడించారు. షట్టర్లు పగలగొట్టి దొంగతనాలకు పాల్పడుతున్న ముఠా నుంచి ఏడు బైక్‌లను ఒకేసారి స్వాధీనం చేసుకోవడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. కేసు దర్యాప్తు కొనసాగుతోందని, పరారీలో ఉన్న మరో నిందితుడిని త్వరలో పట్టుకుంటామని పోలీసులు తెలిపారు.

# చిరుద్యోగులం సారూ.. కనికరించరూ....

### ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావుకు వినతిపత్రం అందజేసిన గ్రామ రెవెన్యూ సహాయకులు



**రాయవరం, సెప్టెంబర్ 22, విశ్వం వాయిస్ న్యూస్ :** రాయవరం మండలంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావుకు గ్రామ రెవెన్యూ సహాయకులు (వీఆర్ఏలు) తమ దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ కార్యాలయాలకు తమ అవసరం ఉందని కానీ తమకు గుర్తింపు లేదని ఆవేదన వ్యక్తం చేస్తూ. వీఆర్ఏలకు గతంలో ప్రభుత్వం పెంచిన 10,500 గౌరవ వేతనం అమలులో ఉన్నప్పటికీ, తమకు సంబంధించిన ఇతర సమస్యలు మాత్రం పరిష్కారానికి నోచుకోవడం లేదని వారు వినతిపత్రంలో పేర్కొన్నారు. తమ సేవలను పరిగణనలోకి తీసుకుని వీఆర్ఏలకు పే స్కేల్ వర్తింపజేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, పర్మినెంట్ చేయాలని వారు కోరారు. అలాగే గతంలో ప్రభుత్వం తమ నుంచి కట్టించుకున్న ?10,200 మొత్తాన్ని తిరిగి చెల్లించాలని డిమాండ్ చేశారు, దీనిపై కూడా ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకుని తమకు న్యాయం చేయాలని వీఆర్ఏలు కోరారు. తమ సమస్యల పరిష్కారం కోసం ఇప్పటికే ఉన్నతాధికారులకు వినతిపత్రాలు అందజేసినట్లు తెలిపారు. తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావును వీఆర్ఏలు కోరారు. వీఆర్ఏల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

# ఐదేళ్ల ప్రజాసేవకు ఘన వీడ్కోలు..

### ముగిసిన ఎంపీటీసీల పదవీకాలం - ప్రజా ప్రతినిధులను సత్కరించిన ఎమ్మెల్యే వేగుళ్ళ

**రాయవరం, సెప్టెంబర్ 22, విశ్వం వాయిస్ న్యూస్ :** మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాల (ఎంపీటీసీ) సభ్యుల ఐదేళ్ల పదవీకాలం ముగియడంతో రాయవరం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశం వీడ్కోలు వేదికగా మారింది. మండల కేంద్రమైన రాయవరంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం ఎంపీపీ నౌడు వెంకటరమణ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఐదేళ్ల పాటు మండల పరిషత్‌లో ప్రజలకు ప్రాతినిధ్యం వహించిన ఎంపీటీసీ సభ్యులు, ఎంపీపీలు, కో-ఆప్షన్ సభ్యులను ఈ సందర్భంగా ఘనంగా సత్కరించారు. ప్రజా ప్రతినిధులుగా తమ పదవీకాలంలో అందించిన సేవలను గుర్తుచేసుకుంటూ వారికి అభినందనలు తెలిపారు. మండల పరిధిలోని గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలులో ప్రజాప్రతినిధులు తమవంతు పాత్ర పోషించారని సమావేశంలో పేర్కొన్నారు. ఐదేళ్ల పాటు ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించిన మండల ప్రజలకు ఎంపీటీసీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలంలోని మండపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చింతపల్లి రామకృష్ణ, మండలంలోని ఎంపీటీసీ సభ్యులు, కో-ఆప్షన్ సభ్యులు, ఎంపీడీవో కార్యాలయ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.






## 2012 నుంచి 2016 వరకు
# నంది ఫిల్మ్స్, టీవీ అవార్డులను అందించనున్నాం

**ఎఫ్‌డీసీ చైర్మన్ పి.భరత్ భూషణ్**



నంది అవార్డులపై ఎఫ్‌డీసీ చైర్మన్ పి. భరత్ భూషణ్ మాట్లాడుతూ.. గతంలో ప్రకటించిన 2012 నుంచి 2016 వరకు నంది ఫిల్మ్, టీవీ అవార్డులను అందించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. 2017 నుంచి 2024 వరకు ప్రతి సంవత్సరానికి 4 అవార్డుల చొప్పున  ప్రొడక్షన్, 2 స్పెషల్ జ్యూరీ అవార్డులు అందించేందుకు ప్రభుత్వం అంగీకరించిందని తెలిపారు. ఎఫ్‌డీసీ చైర్మన్ పి. భరత్ భూషణ్ మాట్లాడుతూ..  2025 సంవత్సరానికి కూడా నంది ఫిల్మ్, టీవీ అవార్డులను అందించేందుకు నిర్ణయం తీసుకున్నాం.. నంది ఫిల్మ్, జాతీయ చలనచిత్ర అవార్డులను అమరావతి లేదా విజయవాడలో నిర్వహించేందుకు నిర్ణయించాం.. నంది టీవీ అవార్డులను తిరుపతి వేదికగా అందించేందుకు నిర్ణయించాం. ఈ అవార్డులన్నింటినీ డిసెంబర్ 2026లోగా ప్రదానం చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని అన్నారు. అలాగే అక్టోబర్‌లో నంది ఫిల్మ్, టీవీ అవార్డుల కోసం కమిటీలను ఏర్పాటు చేస్తాం.. నవంబర్‌లో అవార్డుల ఎంపిక ప్రక్రియను నిర్వహిస్తామన్నారు. డిసెంబర్‌లో నంది ఫిల్మ్, టీవీ అవార్డుల ప్రదానోత్సవ వేడుకలను నిర్వహిస్తామని తెలిపారు భరత్ భూషణ్. అదేవిధంగా నంది ఫిల్మ్ అవార్డుల్లో చలనచిత్రాలు, జాతీయ సమైక్యతపై చలనచిత్రాలు, బాలల చిత్రాలు, డాక్యుమెంటరీ చిత్రాలు, విద్యా విషయక చిత్రాలు, తెలుగు సినిమాపై రచించిన ఉత్తమ రచనలు తదితర విభాగాలు ఉంటాయన్నారు. ఫిల్మ్ విభాగంలో మొత్తం 46 అవార్డులను అందించనున్నాం.. ఉత్తమ ప్రదర్శన, ద్వితీయ ఉత్తమ ప్రదర్శన, తృతీయ ఉత్తమ ప్రదర్శన, ఉత్తమ నటుడు, ఉత్తమ నటి, ఉత్తమ సహాయ నటుడు, ఉత్తమ సహాయ నటి తదితర విభాగాల్లో అవార్డులు అందిస్తాం. నంది ఫిల్మ్ అవార్డు గ్రహీతలకు బంగారు, వెండి, కాంస్య, తామ్ర నందులతో పాటు ప్రశంసాపత్రం, నగదు పారితోషికం అందిస్తాం.. వివిధ కేటగిరీలలో 8 గోల్డ్ మెడల్స్ కూడా అందించనున్నాం అని భరత్ భూషణ్ తెలిపారు.

జాతీయ చలనచిత్ర అవార్డులు

ఎన్.టి.ఆర్. నేషనల్ ఫిల్మ్ అవార్డు - రూ.5 లక్షలు

బి.ఎన్. రెడ్డి నేషనల్ ఫిల్మ్ అవార్డు - రూ.2 లక్షలు

నాగిరెడ్డి-చక్రపాణి నేషనల్ ఫిల్మ్ అవార్డు - రూ.2 లక్షలు

రఘుపతి వెంకయ్య ఫిల్మ్ అవార్డు - రూ.2 లక్షలు

జాతీయ చలనచిత్ర అవార్డు గ్రహీతలకు జ్ఞాపిక, సన్మాన పత్రంతో పాటు నగదు పారితోషికం అందిస్తామన్నారు. అలాగే  టెలి చిత్రాలు, టీవీ ఫీచర్స్, టీవీ మెగా సీరియల్స్, టీవీ డైలీ సీరియల్స్, టీవీ బాలల చిత్రాలు, టీవీ డాక్యుమెంటరీ చిత్రాలు, టీవీ సామాజిక సంబంధిత చిత్రాలు, టీవీ విద్యా విషయక చిత్రాలు తదితర విభాగాల్లో అవార్డులు అందిస్తామన్నారు. టీవీ విభాగంలో మొత్తం 48 అవార్డులను అందించనున్నాం.. ప్రథమ, ద్వితీయ ఉత్తమ టెలి ఫిల్మ్, టెలి ఫీచర్స్, మెగా టీవీ సీరియల్, డైలీ టీవీ సీరియల్, టీవీ బాలల చిత్రం తదితర విభాగాల్లో అవార్డులు అందిస్తాం.. ఉత్తమ నటుడు, నటి, సహాయ నటుడు, హాస్య నటుడు, హాస్య నటి, ప్రతినాయకుడు, బాలల నటుడు, నటి, దర్శకుడు, స్క్రీన్‌ప్లే రచయిత తదితర విభాగాల్లో అవార్డులు అందించనున్నాం అని తెలిపారు. నంది టీవీ అవార్డు గ్రహీతలకు బంగారు, వెండి, కాంస్య, తామ్ర నందులతో పాటు ప్రశంసాపత్రం, నగదు పారితోషికం అందిస్తాం.. తెలుగు సినిమా, టెలివిజన్ రంగానికి చెందిన కళాకారులు, సాంకేతిక నిపుణులను గౌరవించడమే నంది అవార్డుల ప్రధాన ఉద్దేశ్యం అని భరత్ భూషణ్ అన్నారు.

# 72వ జాతీయ చలనచిత్ర అవార్డులు..

## విజేతలుగా నిలిచింది వీరే.. తెలుగు నుంచి ఎవరంటే..

72వ జాతీయ చలనచిత్ర అవార్డుల వేడుక భారతీయ సినీ రంగంలోని ప్రతిభావంతులను ఒకే వేదికపైకి తీసుకువచ్చింది. ముఖ్యంగా అనంత్ నాగ్‌కు దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు, 'ఆర్టికల్ 370'కు ఉత్తమ చిత్రం, యామీ గౌతమ్‌కు ఉత్తమ నటి, మమ్ముట్టి, కార్తిక్ ఆర్యన్‌లకు సంయుక్తంగా ఉత్తమ నటుడి అవార్డులు ఈ వేడుకలో ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. భారతీయ సినీ పరిశ్రమలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావించే జాతీయ చలనచిత్ర అవార్డుల 72వ ప్రదానోత్సవం సెప్టెంబర్ 22న గుజరాత్‌లోని ఏక్తా నగర్‌లో ఘనంగా జరిగింది. 2024లో భారతదేశంలో విడుదలైన చిత్రాలు, నటీనటులు, దర్శకులు, టెక్నీషియన్స్ ప్రతిభను గుర్తిస్తూ ఈ అవార్డులను అందించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము విజేతలకు పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ ఏడాది జాతీయ అవార్డుల వేడుకకు ఏక్తా నగర్ వేదిక కావడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. జాతీయ చలనచిత్ర అవార్డులను ఇకపై దేశంలోని వివిధ రాష్ట్రాలు, నగరాల్లో నిర్వహించాలని కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ నిర్ణయించింది. ఇందులో భాగంగానే తొలిసారి జాతీయ రాజధాని వెలుపల ఈ వేడుకను నిర్వహించారు. ఆర్టికల్ 370 చిత్రానికి ఉత్తమ ఫీచర్ ఫిల్మ్ అవార్డు దక్కింది. ఈ చిత్రంలో నటించిన యామీ గౌతమ్ ఉత్తమ నటిగా అవార్డు అందుకున్నారు. 2024లో విడుదలైన చిత్రాల్లో ఈ మూవీకి జాతీయ స్థాయిలో కీలక గుర్తింపు లభించింది. ఉత్తమ నటుడి విభాగంలో ఈసారి ఇద్దరు నటులు అవార్డును అందుకున్నారు. మమ్ముట్టి 'భ్రమయుగం' చిత్రంలోని నటనకు, కార్తిక్ ఆర్యన్ 'చందు ఛాంపియన్'లో తన నటనకు ఉత్తమ నటుడిగా ఎంపికయ్యారు. ప్రభాస్, దీపికా పదుకొణె, అమితాబ్ బచ్చన్ తదితరులు నటించిన 'కల్కి 2898 ఏడీ' చిత్రానికి 'బెస్ట్ పాపులర్ ఫిల్మ్ ప్రొవైడింగ్ హోల్‌సమ్ ఎంటర్‌టైన్‌మెంట్' అవార్డు లభించింది. మరోవైపు 'అమరన్' చిత్రానికి దర్శకుడు రాజ్‌కుమార్ పెరియసామికి ఉత్తమ దర్శకుడి అవార్డు దక్కింది. అలాగే నిహారిక కొణిదెల నిర్మించిన కమిటీ కుర్రాళ్ళు సినిమాకు అవార్డు దక్కింది. అల్లు అర్జున్ నటించిన 'పుష్ప: ది రూల్ పార్ట్-02' కూడా జాతీయ అవార్డుల్లో సత్తా చాటింది. ఈ చిత్రానికి ఒరిజినల్ స్క్రీన్‌ప్లే, కాస్ట్యూమ్ డిజైన్ విభాగాల్లో గుర్తింపు లభించింది. స్త్రీ 2కు కొరియోగ్రఫీ విభాగంలో అవార్డు దక్కగా, మహారాజాకు



యాక్షన్ డైరెక్షన్ విభాగంలో పురస్కారం లభించింది. నటుడిగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న రణదీప్ హుడా, స్వాతంత్ర్య వీర్ సావర్కర్ చిత్రంతో దర్శకుడిగా అరంగేట్రం చేసి ఉత్తమ డెబ్యూ డైరెక్టర్ అవార్డును అందుకున్నారు. ఈ చిత్రం ఆయనకు దర్శకత్వ రంగంలో జాతీయ స్థాయి గుర్తింపును తీసుకొచ్చింది. ప్రముఖ కన్నడ నటుడు అనంత్ నాగ్కు దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు ప్రదానం చేశారు. ఐదు దశాబ్దాలకు పైగా సినీ ప్రయాణం సాగించిన ఆయన 300కు పైగా చిత్రాల్లో, ఆరు భారతీయ భాషల్లో నటించారు. 72వ జాతీయ చలనచిత్ర అవార్డుల్లో ఫీచర్ ఫిల్మ్స్‌తో పాటు నాన్-ఫీచర్ ఫిల్మ్స్, డాక్యుమెంటరీలు, షార్ట్ ఫిల్మ్స్, యానిమేషన్, సినిమా రచన వంటి విభాగాల్లోనూ ప్రతిభకు గుర్తింపు లభించింది. వివిధ భారతీయ భాషలకు చెందిన చిత్రాలు, కళాకారులు అవార్డులు అందుకోవడం దేశంలోని భాషా, సాంస్కృతిక, సినీ వైవిధ్యాన్ని మరోసారి చాటిచెప్పింది.

# వెంకీ ఫ్యాన్స్‌కు బ్యాడ్ న్యూస్.. ఆదర్శ కుటుంబం విడుదల వాయిదా..



ప్రస్తుతం వెంకటేష్ జోరు పెంచారు. వరుస హిట్స్ తో దూసుకుపోతున్న వెంకటేష్ బ్యాక్ టు బ్యాక్ సినిమాలను లైనప్ చేస్తున్నారు. సంక్రాంతికి వస్తున్నాం సినిమా తర్వాత మన శంకర్ వరప్రసాద్ గారు సినిమాలో స్పెషల్ రోల్ చేశారు వెంకీ. సినిమా కూడా మంచి విజయాన్ని అందుకుంది. విక్టరీ వెంకటేష్, త్రివిక్రమ్ శ్రీనివాస్‌ల ఎంటర్‌టైనర్ మరో వారం ఆలస్యంగా ప్రేక్షకుల ముందుకు విక్టరీ వెంకటేష్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కలయికలో రూపొందుతోన్న భారీ వినోదాత్మక చిత్రం 'ఆదర్శ కుటుంబం, ఏకే47' విడుదల తేదీ మారింది. తొలుత ప్రకటించిన తేదీ కంటే వారం ఆలస్యంగా, ఈ చిత్రాన్ని అక్టోబర్ 9, 2026న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు మేకర్స్ వెల్లడించారు. ప్రేక్షకులకు సంపూర్ణ వినోదానుభూతిని అందించాలనే ఉద్దేశంతో చిత్ర విడుదలను వారం రోజుల పాటు వాయిదా వేయాలని చిత్ర బృందం నిర్ణయించింది. ఇటీవల విడుదలైన ఈ సినిమా టీజర్‌కు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభించింది. మధ్యతరగతి కుటుంబ నేపథ్యంలో వెంకటేష్ పాత్రను పరిచయం చేస్తూ.. హాస్యం, భావోద్వేగాలు, యాక్షన్ అంశాలతో టీజర్ ఆకట్టుకుంది. ఈ నేపథ్యంలో సినిమాపై ప్రేక్షకుల్లో మరింత ఆసక్తి నెలకొంది. త్రివిక్రమ్ శ్రీనివాస్ రచన, దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో వెంకటేష్ సరసన శ్రీనిధి శెట్టి కథానాయికగా నటిస్తున్నారు. నారా రోహిత్, నివేదా పేతురాజ్, రావు రమేష్, సత్య, బ్రహ్మాజీ, వెన్నెల కిశోర్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్. రాధాకృష్ణ (చినబాబు) ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. తమన్ ఎస్ సంగీతం అందిస్తున్నారు. వినోదం, కుటుంబ భావోద్వేగాల సమ్మేళనంగా తెరకెక్కుతున్న 'ఆదర్శ కుటుంబం, ఏకే47' అక్టోబర్ 9, 2026న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది.

# క్రికెట్‌తోనే భారత్‌కు తొలి స్వర్ణం.. ఫైనల్‌లో శ్రీలంకపై ఘన విజయం

ఇంటర్నెట్ డెస్క్: ఆసియా క్రీడల్లో భారత్‌కు తొలి స్వర్ణ పతకం లభించింది. మహిళల క్రికెట్ ఫైనల్‌లో హర్మన్ ప్రీత్ సేన అద్భుత విజయంతో పసిడిని సొంతం చేసుకుంది. తుది పోరులో శ్రీలంకపై 147 పరుగుల తేడాతో టీమ్‌ఇండియా గెలిచింది. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 216/3 స్కోరు చేసింది. అనంతరం లక్ష్య ఛేదనలో శ్రీలంక 69 రన్స్‌కే ఆలౌటైంది. దీంతో శ్రీలంక రజతంతో సరిపెట్టుకుంది. అంతకుముందు జరిగిన కాంస్య పోరులో బంగ్లాదేశ్‌పై పాకిస్థాన్ విజయం సాధించింది.

**బౌలర్ల దెబ్బకు..**

భారత్ నిర్దేశించిన భారీ లక్ష్య ఛేదనకు దిగిన శ్రీలంకకు ఏదీ కలిసిరాలేదు. టీమ్‌ఇండియా బౌలర్ల దెబ్బకు బెంబేలెత్తిపోయారు. ఓ వైపు ఆ జట్టు సారథి చమరి ఆటపట్టు (29) ఒంటరి పోరాటం చేసింది. ఆమెనే శ్రీలంక తరఫున టాప్ స్కోరర్. దీప్తి శర్మ (3/6), షఫాలీ వర్మ (2/3) శ్రీ చరణి (2/13), శ్రేయాంక పాటిల్ (2/9) దెబ్బకు శ్రీలంక ఏ దశలోనూ పోటీలో లేదు. ఇమేషా దులాని (3), హాసిని (0), కవిష దిల్హారి (11), హర్షిత (0), కౌషని (14), హన్సిమ (1), సుగందిక (3)




పరుగులు చేశారు.

**బ్యాటింగ్‌లో మెరుపులు**

శ్రీలంకపై ఇప్పటికే ఆసియా కప్‌లో గెలిచి ఊపుమీదున్న టీమ్‌ఇండియా.. ఈ ఫైనల్స్‌లోనూ అదే జోరు చూపించింది. టాస్ నెగ్గి బ్యాటింగ్ ఎంచుకున్న భారత్ ప్రత్యర్థి ముందు భారీ లక్ష్యం ఉంచింది. షఫాలీ వర్మ (48: 29 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్స్‌లు)తో కలిసి ఓపెనర్ స్మృతి మంధాన (79: 45 బంతుల్లో 5 ఫోర్లు, 7 సిక్స్‌లు) తొలి వికెట్‌కు 99 పరుగులు జోడించింది. ఈ క్రమంలో ఒకే క్యాలెండర్ ఇయర్‌లో అత్యధిక టీ20 పరుగులు చేసిన బ్యాటర్‌గా మంధాన ఘనత సాధించింది. షఫాలీ హాఫ్ సెంచరీ ముంగిట ఔటైంది. అయితే, ఆ తర్వాత వచ్చిన కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ (19)తో మంధాన ఇన్నింగ్స్‌ను నడిపించింది. స్వల్ప వ్యవధిలో వీరిద్దరూ పెవిలియన్‌కు చేరినా.. రిచా ఘోష్ (49లి: 22 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్స్‌లు) మాత్రం ఎదురు దాడి చేసింది. ఓవైపు భారతి (7లి)ను నాన్‌స్ట్రైకింగ్‌కు పరిమితం చేసిన రిచా.. ఆఖరి మూడు ఓవర్లలో భారత్‌కు యాభై పరుగులను అందించింది. శ్రీలంక బౌలర్లలో సుగందిక, కవిష, ప్రబోధ తలో వికెట్ తీశారు.




# ఒకటి వచ్చేసింది.. మరో రెండు పతకాలు ఖాయం



ఆసియా క్రీడల్లో మూడో రోజు భారత్‌కు మిశ్రమ ఫలితాలు వచ్చాయి. అయితే, ఒక స్వర్ణం పతకం సాధించడంతోపాటు మరో రెండు పతకాలను ఖాయం చేసుకుంది. కానీ, మహిళల బ్యాడ్మింటన్ విభాగంలో పతక నిరీక్షణ కొనసాగుతూనే ఉంది. క్వార్టర్ ఫైనల్స్‌లో జపాన్ చేతిలో భారత మహిళా జట్టుకు ఓటమి తప్పలేదు. షూటింగ్ మిక్స్‌డ్ డబుల్స్‌లో కొద్ది తేడాతో పతకం భారత్ చేజారింది. ఎలవెనిల్ వలరివన్ - పార్థ్ మన్నె జోడీ ఫైనల్‌కు అర్హత సాధించినా.. అక్కడ నాలుగో స్థానం దక్కింది.

**ఈ రెండింట్లో..**

అంతా ఆశించినట్టుగానే భారత మహిళా జట్టు ఫైనల్‌లో శ్రీలంకను చిత్తు చేసి గోల్డ్ సొంతం చేసుకుంది. ఇక పురుషుల బ్యాడ్మింటన్‌లోనూ సెమీస్‌కు చేరుకుని పతకం ఖాయం చేసుకుంది. జపాన్‌ను ఓడించి మరీ సెమీస్‌కు వచ్చింది. జపాన్‌పై ఆధిపత్యం ప్రదర్శించిన భారత్ 3-0తో గెలిచింది. గత ఎడిషన్‌లో మన జట్టు రజతం నెగ్గిన సంగతి తెలిసిందే. చైనా / కొరియా మధ్య జరిగే క్వార్టర్ ఫైనల్ విజేతతో భారత్ తలపడనుంది. చైనా డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగింది.

**తీవ్ర ఆరోపణల నేపథ్యంలో..**

రోషిబిన తనను కావాలనే గాయం చేసిందని.. ఆసియా క్రీడల్లో ఆడకుండా చేసిందని వుషు క్రీడాకారిణి దివ్యాంశి ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ఆ రోషిబిన భారత్‌కు పతకం అందించనుంది. 60 కేజీల విభాగంలో సెమీస్‌కు దూసుకెళ్లింది. మరో అథ్లెట్ ఆర్యన్‌కు 56 కేజీల క్వార్టర్ ఫైనల్స్‌లో ఓటమి తప్పలేదు. జిమ్నాస్టిక్స్ మహిళల వాల్ట్ విభాగంలో ప్రణతి నాయక్ ఫైనల్‌కు చేరుకుంది.

**50 దాటేసిన చైనా మెడల్స్**

ఆసియా క్రీడలు 2026లో 50+ పతకాలను చైనా సాధించింది. చైనా ఖాతాలో 31 బంగారు, 13 రజతాలు, 8 కాంస్య పతకాలు ఉన్నాయి. ఇక భారత్ ఒక స్వర్ణం, 4 రజతాలు 2 కాంస్య పతకాలతో పట్టికలో ఎనిమిదో స్థానంలో ఉంది. రెండో స్థానం ఆతిథ్య దేశం జపాన్‌దే. 11 స్వర్ణాలు, 15 రజతాలు, 19 కాంస్యాలతో 45 పతకాలతో ద్వితీయ స్థానంలో ఉంది.

# జపాన్‌తో చారిత్రక మ్యాచ్.. భారత్‌దే విజయం



ఆసియా క్రీడల్లో స్వర్ణమే లక్ష్యంగా బరిలోకి దిగబోతున్న టీమ్‌ఇండియా.. అంతకంటే ముందే విజయాల బోణీ కొట్టింది. ఆసియా క్రీడల ఆతిథ్య దేశం జపాన్‌తో జరిగిన చారిత్రక తొలి టీ20 మ్యాచ్‌లో భారత్ విజయం సాధించింది. వర్షం కారణంగా 5 ఓవర్లకు కుదించిన ఈ మ్యాచ్‌లో.. జపాన్‌పై టీమ్‌ఇండియా 2 పరుగుల తేడాతో గెలుపొందింది. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత్.. నిర్ణీత ఐదు ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 32 పరుగులు చేసింది. ఓపెనర్ అభిషేక్ శర్మ మరోసారి డకౌట్ అయ్యాడు. సంజూశాంసన్ (9), ఇషాన్ కిషన్ (3) కూడా విఫలమయ్యారు. శ్రేయస్ అయ్యర్ (16) ఫర్వాలేదనిపించాడు. జపాన్ బౌలర్లలో ఛార్లీ హరా-హింజే రెండు వికెట్లు తీయగా.. ఇబ్రహిం తకహషీ, బెంజమిన్ ఇతో-డేవిస్ చెరో వికెట్ తీసుకున్నారు. లక్ష్య ఛేదనలో జపాన్ గట్టిపోటీ ఇచ్చింది. అయితే, నిర్ణీత ఓవర్లలో ఆ జట్టు మూడు వికెట్ల నష్టానికి 30 పరుగులకే పరిమితమైంది. జపాన్ బ్యాటర్లలో కెండెల్ కడోవాకి-ఫ్లెమింగ్ (12), జెంజమిన్ ఇతో డేవిస్ (9) ఫర్వాలేదనిపించారు. భారత బౌలర్లలో వాషింగ్టన్ సుందర్ రెండు వికెట్లు తీశాడు. ఓపెనర్ లచ్లాన్ యమమోటో లేక్ రనౌట్ అయ్యాడు.

**మరికొన్ని విశేషాలు**

అంతర్జాతీయ టీ20ల్లో భారత్‌కు ఇది 200వ విజయం. 2006లో దక్షిణాఫ్రికాపై తొలి విజయాన్ని నమోదు చేసిన టీమ్‌ఇండియా.. 2017లో శ్రీలంకపై 50వ విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. వెస్టిండీస్‌పై 100వ (2022), ఆస్ట్రేలియాపై 150వ (2024) విజయాన్ని నమోదు చేసింది. అత్యంత తక్కువ మార్జిన్‌తో టీమ్‌ఇండియా గెలిచిన మ్యాచుల్లో ఇది ఒకటి. దక్షిణాఫ్రికా (2012), బంగ్లాదేశ్ (2016) జట్లపై ఒక పరుగు తేడాతో నెగ్గిన భారత్.. శ్రీలంకపైనా ఓసారి (2023) రెండు పరుగులు తేడాతో విజయం సాధించింది. ఐసీసీ శాశ్వత సభ్య దేశాల్లో భారత్ ఇప్పటివరకు 20 దేశాలపై ఆడిన తొలి మ్యాచ్‌ల్లో 17 సార్లు గెలుపొందింది. న్యూజిలాండ్, వెస్టిండీస్‌పై ఓడిపోగా.. స్కాట్లాండ్‌తో ఆడిన మ్యాచ్‌లో ఫలితం తేలలేదు.

**అభిషేక్ ఖాతాలో చెత్త రికార్డ్..**

ఈ మ్యాచ్‌లో భారత ఓపెనర్ అభిషేక్ శర్మ తాను ఎదుర్కొన్న తొలి బంతికే ఔటై గోల్డెన్ డక్‌గా వెనుదిరిగాడు. దీంతో అంతర్జాతీయ టీ20 క్రికెట్‌లో అత్యంత చెత్త రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. పొట్టి ఫార్మాట్‌లో ఎక్కువసార్లు గోల్డెన్ డక్ అయిన భారత ఓపెనర్‌గా నిలిచాడు. ఇప్పటివరకు రోహిత్ శర్మ అంతర్జాతీయ టీ20ల్లో 4 సార్లు ఇలా ఔటవ్వగా.. అభిషేక్ ఐదు సార్లు గోల్డెన్ డక్‌గా పెవిలియన్‌కు చేరాడు. ఇక, ఒక క్యాలెండర్ ఏడాదిలో టీ20ల్లో అత్యంత ఎక్కువసార్లు డకౌట్ అయిన బ్యాటర్‌గానూ అభిషేక్ శర్మ మరో చెత్త రికార్డును తన పేరిట రాసుకున్నాడు. ఈ ఏడాది అతడు 10 సార్లు ఇలా ఔట్ అయ్యాడు. ఈ జాబితాలో 9 డకౌట్లతో రషీద్ ఖాన్ (2019), షాదాబ్ ఖాన్ (2024) తర్వాతి స్థానాల్లో ఉన్నారు.

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com